## మొదటి పేజి తరువాయి

## మండలిలో మాటల యుద్ధం.. బొత్స, మంత్రి పార్థసారథి మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు!

ప్రైవేటు ఆసుపత్రులు 'ఆరోగ్యశ్రీ'ని నిరాకరిస్తున్నాయని, 'తల్లికి వందనం' సక్రమంగా అందడం లేదని విమర్శించారు. "మేం సభను తప్పుదోవ పట్టించడం లేదు. అధికార పక్షం మా ఆరోపణలు తప్పని రుజువు చేస్తే, మా మాటలు వెనక్కి తీసుకుని సారీ చెబుతాం" అని బొత్స స్పష్టం చేశారు. అలాగే గత 19 నెలల్లో 60 ఏళ్లు నిండిన వారికి ఎన్ని కొత్త పింఛన్లు ఇచ్చారని, తాము పెట్టిన అర్హత నిబంధనలను ఏమైనా మార్చారా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. బొత్స ఆరోపణలకు మంత్రి కొలుసు పార్థసారథి అంతే దీటుగా స్పందించారు. బొత్స సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. 'తల్లికి వందనం' నిధులు నియోజకవర్గాలు, జిల్లాల వారీగా పంపిణీ చేసినట్లు పత్రాలతో సహా నిరూపిస్తామని, ఒకవేళ రుజువు చేయలేకపోతే ఏ శిక్షకైనా సిద్ధమని ప్రతిసవాల్ విసిరారు. 'అన్నదాత సుఖీభవ' కింద 48 లక్షల మందికి లబ్ధి చేకూరితే, "ఒక్కరికీ పడలేదు" అనడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. "నేను ఛాలెంజ్ చేస్తున్నా. రండి చెక్ చేద్దాం" అంటూ బొత్సను చర్చకు ఆహ్వానించారు. ఈ చర్చలో పింఛన్ల అంశంపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జోక్యం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 20 నెలల్లో ఒక్క పింఛనూ తొలగించలేదని స్పష్టం చేశారు. 4.7 లక్షల మరణాల కారణంగా 2.7 లక్షల పింఛన్లు ఆగిపోయాయని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 63.2 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నామని వివరణ ఇచ్చారు. మొత్తం మీద, సంక్షేమ పథకాల అమలు విషయంలో ఇరుపక్షాల ఆరోపణలు, ప్రత్యారోపణలతో మండలిలో రాజకీయ వేడి కొనసాగుతోంది.

## మండలిని శాసించాలని బొత్స ప్రయత్నించడం హాస్యాస్పదం

గత ఐదేళ్ల పాలనలో ఒక్క కంపెనీని కూడా తీసుకురాలేకపోయిన వైసీపీ నేతలు, ఇప్పుడు కూటమి ప్రభుత్వం పరిశ్రమలు తీసుకొస్తుంటే బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. పరిశ్రమలకు భూములే ఇవ్వకపోతే కంపెనీలు ఎలా వస్తాయని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. మంత్రి నారా లోకేశ్ గణాంకాలతో సహా సమాధానం ఇస్తుంటే, వినే ఓపిక లేక వైసీపీ సభ్యులు సభలో గందరగోళం సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. మన దేశానికి వస్తున్న ప్రతి వంద రూపాయల పెట్టుబడిలో 26 రూపాయలు ఆంధ్రప్రదేశ్‌కే వస్తున్నాయని, ఇదే తమ కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అచ్చెన్నాయుడు తెలిపారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలన్నా, రాష్ట్ర యువతకు ఉద్యోగాలు రావాలన్నా పరిశ్రమల స్థాపన అత్యవసరమని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే, భవిష్యత్తులో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన వైసీపీ నేతలను హెచ్చరించారు.

## 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు రక్షణ శాఖ పచ్చజెండా

కేంద్రం పచ్చజెండా ఊపింది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ సంబంధిత ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. వీటిలో చాలా విమానాలను 'మేక్ ఇన్ ఇండియా' కింద భారత్‌లోనే తయారు చేయనున్నారు. అదే విధంగా, సుదూర లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించే 'కాంబ్యాట్ క్షిపణుల' కొనుగోలుకు అనుమతి లభించింది. నిఘా, టెలికమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్ అవసరాల కోసం ఉపయోగించే ఎయిర్‌షిప్ ఆధారిత హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్లకు డీఏసీ ఆమోదం తెలిపింది. యాంటీ ట్యాంక్ మైన్స్, పీ-8ఐ విమానాలు, మెరైన్ గ్యాస్ టర్బైన్ జనరేటర్లు వంటి కీలక యుద్ధ పరికరాల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్'కు ఇది మరింత ఊతమిస్తుందని రక్షణశాఖ తెలిపింది.

## 114 రఫేల్ యుద్ధ విమానాలు, 6 పీ8ఐ విమానాలకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈనెల ద్వితీయార్థంలో భారత్ పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగానే డిఫెన్స్ డీల్‌పై సంతకాలు జరిగే అవకాశాలున్నాయి. డీల్ ప్రకారం 18 రఫేల్ జట్లను 'ఫ్లై-అవే కండిషన్'లో నేరుగా తీసుకువస్తారు. తక్కిన 96 విమానాలు ఇండియాలో అసెంబుల్ చేస్తారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా స్థానికంగా తయారీ, అసెంబెల్ కోసం రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్, భారత్‌లోని ప్రైవేటు రంగ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంటారు. భారత వాయుసేన వద్ద ప్రస్తుతం 36 రఫేల్ యుద్ధవిమానాలు ఉన్నాయి.

## ఢిల్లీలో రేవంత్ రెడ్డి బిజీబిజీ.. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ

ఓఎల్ఎస్ సర్వే, ఫీజబిలిటీ స్టడీ నిర్వహించాలని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి, అదనంగా 249.82 ఎకరాలు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కూడా కలిశారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టులపై ఆయనతో చర్చించారు. ముఖ్యమంత్రి నిన్న రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తదితరులతో భేటీ అయ్యారు.

## అడవుల్లోని గిరిజన గ్రామాలకు 'సంజీవని' డ్రోన్లు.. ఏపీలో సరికొత్త వైద్య సేవలు!

ఈ ప్రయాణంలో జరిగే ఆలస్యం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండటం కూడా తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరుకు చెందిన రెడ్ వింగ్ సంస్థతో కలిసి డ్రోన్ల సేవలను కూటమి ప్రభుత్వం ప్రారంభించింది. ఆసుపత్రులకు వెళ్లడానికి గంటల సమయం పట్టే ప్రాంతాలకు కేవలం 15 నుంచి 20 నిమిషాల్లోనే అత్యవసర మందులను డ్రోన్లు అందజేస్తాయి. ఇవి సాధారణ డ్రోన్ల మాదిరి కాకుండా... శాటిలైట్ ట్రాకింగ్ తో ఆటోమేటెడ్ సాఫ్ట్ వేర్ తో పనిచేస్తాయి. 5 కేజీల బరువున్న మెడిసిన్స్, వ్యాక్సిన్స్, బ్లడ్ ప్యాకెట్స్, పాము కాటు మందులను చేరవేయడమే కాకుండా, అక్కడి రోగుల రక్త నమూనాలను పరీక్షల కోసం తిరిగి ఆసుపత్రికి తీసుకొస్తాయి. దీనివల్ల సకాలంలో వైద్యులు చికిత్స అందించడం సాధ్యమవుతుంది. పాడేరు డిగ్రీ కాలేజీని ప్రధాన హబ్ గా చేసుకుని ఈ డ్రోన్ ఆపరేషన్లను నిర్వహిస్తున్నారు.

## మాదాపూర్‌లోని ఖానామెట్‌లో హైడ్రా కూల్చివేతలు..

తమకు న్యాయం చేయాలని బాధితులు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాగా, అనుమతులు లేకుండా భవనాలు, షెడ్లు నిర్మించారని ఆరోపిస్తూ హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ప్రభుత్వ భూమిలో రోడ్డు పక్కన అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేశారని, అవి అక్రమ నిర్మాణాలని హైడ్రా అధికారులు చెబుతున్నారు.

## ఐపీఎల్ బెట్టింగ్ వివాదం: రూ.10 లక్షలు చెల్లించాలని ధోనీకి మద్రాస్ హైకోర్టు ఆదేశాలు!

ఐపీఎల్ బెట్టింగ్ ఆరోపణల కేసులో కీలక పరిణామం- మాజీ ఐపీఎస్ అధికారి సంపత్ కుమార్‌పై ధోనీ వేసిన కేసు

### మార్చి 12 లోగా చెల్లించాలని డెడ్‌లైన్

ఢిల్లి : టీమ్ ఇండియా మాజీ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీకి మద్రాస్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తన పరువుకు భంగం కలిగించారంటూ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి సంపత్ కుమార్‌పై ధోనీ దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువు నష్టం దావా కేసులో న్యాయస్థానం తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా, సాక్ష్యాలకు సంబంధించిన సీడీ పత్రాలను లిఖితపూర్వకంగా మార్చినందుకు గాను, ధోనీ రూ.10 లక్షల ఫీజు చెల్లించాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మొత్తాన్ని మార్చి 12వ తేదీ లోపు చెల్లించాలని జస్టిస్ ఆర్.ఎన్. మంజుల ఆదేశించారు. ధోనీ పిటిషనర్ అయినప్పటికీ, ఆయనే ఎందుకు డబ్బులు కట్టాలి అనే సందేహం రావచ్చు. దానికి కారణం ఇదే. ఈ కేసులో కీలక సాక్ష్యాలుగా కొన్ని సీడీలు ఉన్నాయి. ఈ వీడియో/ఆడియో రికార్డులను కోర్టు భాషలోకి, లిఖితపూర్వక పత్రాలుగా మార్చాల్సి ఉంది. దీనికోసం కోర్టు ఒక ట్రాన్స్‌లేటర్‌ను, ఒక టైపిస్ట్‌ను నియమించింది. ఈ పని చాలా పెద్దది. వారు దీనికోసం తమ పూర్తి సమయాన్ని వెచ్చించాల్సి వచ్చింది. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి ఏకంగా మూడు నుంచి నాలుగు నెలల సమయం పట్టింది. వారి శ్రమకు, అదనపు ఖర్చులకు గాను ఈ ఫీజు చెల్లించాలని కోర్టు నిర్ణయించింది. ఈ రూ.10 లక్షలను 'చీఫ్ జస్టిస్ రిలీఫ్ ఫండ్'లో జమ చేయాలని ధోనీని ఆదేశించింది.

12 ఏళ్ల నాటి వివాదం

ఈ కేసు మూలాలు 2013 నాటి ఐపీఎల్ బెట్టింగ్ కుంభకోణంలో ఉన్నాయి. 2013లో ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్, బెట్టింగ్ ఆరోపణలు సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఈ కేసును విచారించిన అధికారుల్లో ఐపీఎస్ అధికారి సంపత్ కుమార్ కూడా ఉన్నారు. అయితే, సంపత్ కుమార్ ఒక ప్రైవేట్ న్యూస్ ఛానల్ డిబేట్‌లో పాల్గొన్నారు. ఆ చర్చలో ఆయన ధోనీపై కీలక ఆరోపణలు చేశారు. చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ అయిన ధోనీకి కూడా ఐపీఎల్ గ్యాంబ్లింగ్‌తో సంబంధం ఉందని ఆయన కామెంట్ చేశారు. ఇది అప్పట్లో పెద్ద దుమారం రేపింది. సంపత్ కుమార్ వ్యాఖ్యలను ధోనీ సీరియస్‌గా తీసుకున్నారు.

# ఇది మత స్వేచ్ఛపై దాడి'- వందేమాతరం తప్పనిసరిపై జమియత్

మొదటి పేజి తరువాయి

రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, సుప్రీంకోర్టు అనేక తీర్పుల స్పష్టమైన ఉల్లంఘనే."

మౌలానా అర్షద్ మదానీ, జమియత్ అధ్యక్షుడు

వందేమాతరం గీతాన్ని తప్పనిసరి చేయడం, పౌరులపై రుద్దడానికి ప్రయత్నించడం దేశభక్తి వ్యక్తీకరణ కాదన్నారు మౌలానా అర్షద్ మదానీ. ఇది ఎన్నికల రాజకీయాలను, మతపరమైన ఎజెండాగా కనిపిస్తుందని చెప్పారు ముఖ్యంగా ప్రాథమిక సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి చేసిన ఉద్దేశపూర్వక ప్రయత్నమని అన్నారు. వందేమాతరం తప్పనిసరి చేయడం రాజ్యాంగం, మత స్వేచ్ఛ, ప్రజాస్వామ్య సూత్రాలపై స్పష్టమైన దాడి అని ఆయన పేర్కొన్నారు. "ఒకరికి దేశం పట్ల ఉన్న ప్రేమకు నిజమైన కొలత నినాదాల్లో కాదు, వారి వ్యక్తిత్వం, త్యాగాల్లో ఉంటుంది. దేశం కోసం ముస్లింలు, జమియత్ ఉలామా-ఇ-హింద్ చేసిన త్యాగాలను చారిత్రాత్మక పోరాటంలో చూడవచ్చు. ఇటువంటి నిర్ణయాలు దేశ శాంతి, ఐక్యత, ప్రజాస్వామ్య విలువలను బలహీనపరుస్తాయి. ముఖ్యంగా రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తాయి." అని మదానీ అన్నారు.

### వందేమాతరంపై కేంద్ర మార్గదర్శకాలు

అంతకుముందు బంకించంద్ర ఛటోపాధ్యాయ రచించిన జాతీయ గేయం 'వందేమాతరం'లో మొత్తం ఆరు చరణాలను ఇకపై అధికారిక కార్యక్రమాల్లో పాడాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశించింది. జాతీయ గేయం వందేమాతరం, జాతీయ గీతం జనగణమన రెండింటినీ కలిపి పాడాల్సి వచ్చినప్పుడు మొదట వందేమాతరాన్నే ఆలపించాలని స్పష్టం చేసింది. జాతీయ గేయం పాడటానికి సంబంధించి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తొలిసారిగా కొన్ని నిబంధనలను రూపొందించి జనవరి 28న ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకం ఆవిష్కరణ, గవర్నర్ల ప్రసంగాలు వంటి అధికారిక కార్యక్రమాల్లో 3 నిమిషాల 10 సెకన్ల నిడివి గల వందేమాతరంలోని ఆరు చరణాలను పాడాలని ఆదేశించింది. జాతీయ గేయం పాడుతున్నప్పుడు సభలో ఉన్నవారంతా లేచి నిలబడాలని స్పష్టం చేసింది. జాతీయ గేయం అధికారిక చరణాలు పాడినా లేక ప్లేచేసి వినిపించినా ప్రేక్షకులు గౌరవార్థం నిలబడాలని కేంద్రం తెలిపింది. అయితే న్యూస్‌రీల్ లేదా డాక్యుమెంటరీలలో భాగంగా చలనచిత్రం మధ్యలో ఈ గేయం వస్తే ప్రేక్షకులు నిలబడాల్సిన అవసరం లేదని స్పష్టత ఇచ్చింది. పాఠశాలల్లో రోజువారీ కార్యకలాపాలను జాతీయ గేయంతోనే ప్రారంభించాలని సూచించింది. జాతీయ జెండా ఆవిష్కరణ, పరేడ్లు కాకుండా ఇతర సాంస్కృతిక లేదా అధికారిక వేడుకలు, ప్రభుత్వ కార్యక్రమాలకు రాష్ట్రపతి విచ్చేసినప్పుడు అధికారిక రూపంలోని వందేమాతరాన్ని సామూహికంగా పాడాలని తేల్చిచెప్పింది.

# పరిశ్రమలకు భూ కేటాయింపులపై శాసనమండలిలో వాడీవేడి చర్చ

మొదటి పేజి తరువాయి

విశాఖలో కోట్ల రూపాయల విలువైన భూములను ప్రైవేటు సంస్థలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు 99 పైసలకే ఎలా ఇస్తారని వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. ఈ ఆరోపణలపై మంత్రి లోకేశ్ సమగ్రంగా సమాధానమిచ్చారు.

### విశ్వసనీయత ఉన్న 5 కంపెనీలకే 99 పైసలకు భూమి

రాష్ట్రంలో కేవలం ఐదు విశ్వసనీయమైన (క్రెడిబులిటీ) కంపెనీలకే 99 పైసలకు భూములు కేటాయించినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (ఁజూ), కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకు మాత్రమే ఈ ధరకు భూములు ఇచ్చామన్నారు. ఈ ఐదు కంపెనీల ద్వారా రాష్ట్రంలో సుమారు 65,000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయని వివరించారు. ఉదాహరణకు, కాగ్నిజెంట్ మొదట 8,000 ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, భూమిపూజ సమయంలో ఆ సంఖ్యను 25,000కు పెంచిందని గుర్తుచేశారు.

### ఏపీకి పరిశ్రమలు రాకూడదన్నదే వైసీపీ లక్ష్యం

వైసీపీ తీరుపై మంత్రి లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏపీకి పరిశ్రమలు రాకూడదని, పెట్టుబడులను తరిమేయాలనే ఏకైక లక్ష్యంతో వైసీపీ పనిచేస్తోందని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదం నడిచిందని, అమర్ రాజా వంటి సంస్థను రాష్ట్రం నుంచి తరిమేశారని విమర్శించారు. తాము 17 నెలల్లోనే ఆర్సెలర్ మిట్టల్ వంటి ప్రతిష్మాత్మక సంస్థను రాష్ట్రానికి తీసుకొచ్చామని, దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఉత్తరాంధ్రలో రాబోతోందని చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా వైసీపీ సభ్యులు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.

### హైదరాబాద్ మోడల్‌ను విశాఖలో పునరావృతం చేస్తాం



విశాఖలో బలమైన ఐటీ ఎకోసిస్టమ్ లేదని, దాన్ని నిర్మించడానికే ప్రభుత్వం తక్కువ ధరకు భూములు కేటాయిస్తోందని లోకేశ్ వివరించారు. 1994-2004 మధ్య చంద్రబాబు హైదరాబాద్‌లో ఐఎస్‌బీ, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ వంటి సంస్థలకు తక్కువ ధరకే భూములు ఇవ్వడం వల్లే నేడు హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారిందన్నారు. గుజరాత్‌లో టాటా నానో ఫ్యాక్టరీకి అప్పటి సీఎం నరేంద్ర మోదీ 99 పైసలకే భూమి ఇచ్చి మొత్తం ఆటోమొబైల్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో విశాఖను ఐటీ, జీసీసీ హబ్‌గా మార్చాలనేది తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.

### ఆరోపణలు నిరూపించలేక వైసీపీ వాకౌట్

చర్చ సందర్భంగా, అడ్రస్ లేని ఉర్సా కంపెనీకి ప్రభుత్వం భూములు కట్టబెట్టాలని చూస్తోందని వైసీపీ సభ్యులు ఆరోపించారు. ఈ ఆరోపణను మంత్రి లోకేశ్ తీవ్రంగా ఖండించారు. తాము కేవలం ఐదు కంపెనీలకే 99 పైసలకు భూములు ఇచ్చామని, ఆరో కంపెనీ అయిన ఉర్సాకు భూములు కేటాయించినట్లు ఆధారాలు బయటపెట్టాలని సవాల్ విసిరారు. నిరూపించలేకపోతే క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ఈ క్రమంలో వైసీపీ సభ్యులు, బొత్స సత్యనారాయణ నేతృత్వంలో నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు.

### విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలే మా లక్ష్యం

విపక్ష సభ్యులు వాకౌట్ చేసిన అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. 2029 నాటికి ఒక్క విశాఖలోనే ఐటీ రంగంలో 5 లక్షల ఉద్యోగాలు సృష్టించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఒక ఐటీ ఉద్యోగం ద్వారా పరోక్షంగా మరో ఐదారుగురికి ఉపాధి లభిస్తుందని, దీనివల్ల విశాఖ ఆర్థిక వ్యవస్థకు ఏటా 10 బిలియన్ డాలర్ల మేర మేలు జరుగుతుందని వివరించారు. ప్రభుత్వానికి రెండు రూపాయల ఆదాయం తగ్గినా పర్వాలేదు కానీ, యువతకు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.

### ప్రతిపక్ష ఆరోపణలు సత్యదూరం

వైసీపీ సభ్యులు సత్యదూరమైన మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఛాలెంజ్ చేస్తే సమాధానం చెప్పలేక పారిపోవడం వారికి అలవాటేనని లోకేశ్ ఎద్దేవా చేశారు. భూముల కేటాయింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని, అధికారుల కమిటీ, ఎస్ఐపీబీ, కేబినెట్ ఆమోదం తర్వాతే కేటాయింపులు చేస్తున్నామని తెలిపారు. క్లస్టర్ విధానంలో పరిశ్రమలను అభివృద్ధి చేస్తామని, ప్రతి పరిశ్రమ గ్రౌండింగ్ అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు

# బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చినా చేదు జ్ఞాపకాలే మిగిలాయి

మొదటి పేజి తరువాయి

జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బాగ్ లింగంపల్లిలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో కవిత మాట్లాడుతూ... ఉద్యమ సోయి లేని రేవంత్ రెడ్డి సీఎం కావడం తెలంగాణ చేసుకున్న దౌర్భాగ్యమని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాబోయే బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకపోతే ఊరుకోబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చినా చేదు జ్ఞాపకాలే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కోదండరామ్, ఆకునూరి మురళి వంటివారు రేవంత్‌తో కలవడంతోనే తాము కాంగ్రెస్‌ను నమ్మామని... కానీ రెండున్నరేళ్లుగా ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడటం లేదని కవిత విమర్శించారు. బడ్జెట్ లో హామీలకు సంబంధించిన నిర్ణయాలు లేకపోతే కోదండరామ్ ను ప్రశ్నిస్తామని హెచ్చరించారు. త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ పెడతామని కవిత ప్రకటించారు. అది పక్కా రాజకీయ పార్టీ కాదని, తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే పార్టీ అని స్పష్టం చేశారు. సహనశీలత లేకపోవడం, అహంకారం కారణంగానే బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని, మంచితనం, భోళాతనం తెలంగాణ తత్వమని చెప్పారు. అవి కోల్పోతే మనల్ని మనం కోల్పోయినట్టేనని అన్నారు. ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల వైపే ధర్మం ఉందని, వారి కోసం పోరాటం చేస్తామని కవిత ప్రకటించారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో తెలంగాణ బిడ్డలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జయశంకర్ సార్ విగ్రహం కేబీఆర్ పార్క్‌లో లేదా ట్యాంక్



బండ్‌పై పెట్టాలని అప్పట్లో మున్సిపల్ శాఖ మంత్రిని ఎన్నోసార్లు అభ్యర్థించినా సాధ్యం కాలేదని అన్నారు.

# అమెరికాను తలదన్నే వృద్ధి.. వైరల్ కథనాల వెనుక ఆర్థిక సత్యం




ఇటీవలి కాలంలో సోషల్ మీడియా, యూట్యూబ్ ఫ్యాక్ట్ ఛానెల్స్, రీల్స్, షార్ట్స్‌లలో 'అమెరికాను భయపెడుతున్న ఐఎంఎఫ్ రిపోర్ట్', 'భారత్ ఎదుగుదలతో ట్రంప్ కలవరపడుతున్నాడు' అనే వాక్యాలు విస్తృతంగా ప్రచారం అవుతున్నాయి.. అయితే, ఇవి వినడానికి ఎంత ఆకర్షణీయంగా ఉన్నా, వాటి వెనుక ఉన్న నిజానిజాలను ప్రశాంతంగా, బాధ్యతతో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.. ఎందుకంటే ఇది కేవలం ఒక దేశం గర్వించదగిన విషయం గురించే కాదు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దిశను సూచించే అంశం కూడా.. అందుకే జాగ్రత్తగా పరిశీలించాలి..

### ఐఎంఎఫ్ అంటే ఏమిటి?

దీనిని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ అంటాం. ఇది ప్రపంచ దేశాల ఆర్థిక పరిస్థితులను పరిశీలించి, ఆయా దేశాల ఆర్థిక వృద్ధి రేట్లు (జీడీపీ), అప్పులు, ద్రవ్యోల్బణం, ఉద్యోగ పరిస్థితులు వంటి సంబంధిత అంశాలపై నివేదికలను విడుదల చేస్తుంది. ఈ నివేదికలను ప్రభుత్వాలు, బ్యాంకులు, పెట్టుబడిదారులు అత్యంత ప్రాముఖ్యంగా, ప్రామాణికంగా పరిగణిస్తారు. ఎందుకంటే అవి భవిష్యత్తు ఆర్థిక నిర్ణయాలకు దిశా నిర్దేశం చేస్తాయి..

### ఐఎంఎఫ్ నివేదికల ప్రకారం..

ఈ ఐఎంఎఫ్ నివేదిక ప్రకారం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనాన్ని ఎదుర్కొంటున్న సమయంలో కూడా చైనా తర్వాత భారత్ అత్యంత వేగంగా ఎదుగుతూ ప్రధాన ఆర్థిక శక్తిగా నిలుస్తోంది. అమెరికా, యూరప్ దేశాల్లో ముఖ్యంగా జర్మనీ, ఇంగ్లాండ్ దేశాల వృద్ధి రేట్లు తగ్గుతున్నా, భారత్ మాత్రం 6 నుంచి 7 శాతం మధ్య స్థిరమైన వృద్ధిని కొనసాగిస్తుందని ఈ నివేదిక అంచనా వేసింది. దీనికి ప్రధాన కారణం భారతదేశానికి విస్తృతమైన వినియోగ మార్కెట్, యువ జనాభా, సేవారంగం, ఐటీ, ఫార్మా మొదలైన తయారీ రంగాల్లో పెరుగుదల భారత్‌కు బలంగా మారుతున్నాయి.

### అమెరికా ఎందుకు కలవరపడుతోంది?

భారత్ ఎదుగుదల నేపథ్యాన్ని చూస్తే, అమెరికా చాలా కాలంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో (పెట్రో డాలర్) అగ్రస్థానంలో ఉంది. ఈ డాలర్ అంతర్జాతీయ కరెన్సీగా కొనసాగుతోంది. అలాంటి పరిస్థితిలో చైనా, భారత్ వంటి దేశాలు వేగంగా ఎదగడం అమెరికా విధానకర్తల్లో ఆందోళన కలిగించడం సహజ పరిణామమే.. దీనిని భయం అనే కంటే పోటీ భావనగా చూడాలి.. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన వెంటనే 'అమెరికా ఫస్ట్' అనే నినాదం లాంటి విధానంతో ముందుకు వెళ్లారు.. వాణిజ్య ఒప్పందాలపై కఠిన వైఖరి అనుసరించి, మిత్ర దేశం, శత్రు దేశం అనే తేడా లేకుండా టారిఫ్ యుద్ధాలు మొదలు పెట్టారు.. ఈ నేపథ్యంలో ఐఎంఎఫ్ నివేదిక ఆందోళన కలిగించింది. అమెరికా తన ఆర్థిక ఆధి పత్యాన్ని కాపాడుకోవాలనే వ్యూహం లో ఐఎంఎఫ్ వంటి సంస్థలు భారత్‌ను ప్రశంసిస్తే, ట్రంప్ లాంటి నాయకులు అసహనం వ్యక్తం చేయడం రాజకీయంగా ఆశ్చర్యకరం కాదు.

### సోషల్ మీడియా కథనాలు నిజమా?

అయితే సోషల్ మీడియాలో చెప్పినట్టుగా ట్రంప్ 'భయపడి పోయాడు' అనడం మాత్రం అతిశయోక్తి కావచ్చు.. ఎందుకంటే రాజకీయ వ్యాఖ్యలు, ప్రచారాలు వాస్తవాలను పూర్తిగా ప్రతిబింబించవు. ఐఎంఎఫ్ నివేదిక కూడా భారత్‌ను పొగడటంతో పాటు దేశం ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలపై హెచ్చరికలు చేస్తోంది. ముఖ్యంగా నిరుద్యోగం, ఆదాయ అసమానతలు, గ్రామీణ ఆర్థిక బలహీనతలు, విద్య, ఆరోగ్య రంగాల్లో లోపాలు ఇంకా భారత్ ముందున్న సవాళ్లే. యూట్యూబ్‌లో కనిపించే 'టాప్ టెన్ ఫ్యాక్ట్స్', 'అన్‌నోన్ ఫ్యాక్ట్స్', 'అమేజింగ్ ఫ్యాక్ట్స్' మొదలైన వీడియోల్లో కొంత నిజం, కొంత అర్థసత్యం, మరికొంత పూర్తిగా క్లిక్‌బైట్ ప్రచారం ఉంటుంది. ఐఎంఎఫ్ నివేదికను కూడా సంచలనంగా మార్చి చూపించడం అదే కోవకు చెందుతుంది. వాటిని వినోదం కోసం చూడొచ్చు, కానీ దేశ భవిష్యత్తుపై అభిప్రాయాలు ఏర్ప రచుకునే టప్పుడు లోతైన అవగాహన అవసరం.

### ఎదుగుతోంది నిజమే... అతిశయం వద్దు!

భారత్ ఎదుగుతోంది అనే మాట నిజం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దాని ప్రాధాన్యత పెరుగుతోందనేది కూడా వాస్తవమే.. కానీ అదే సమయంలో తన బలహీనతలను నిర్లక్ష్యం చేయకుండా సరిదిద్దుకోవాల్సిన బాధ్యత కూడా దేశంపై ఉంది. ఐఎంఎఫ్ నివేదిక సారాంశం ఇదే.. భారత్‌ను తక్కువ అంచనా వేయకండి, కానీ వాస్తవాలను అతిశయంగా చూడకండి. చదవడం మాత్రమే కాదు, ఏమి చదవాలో తెలుసుకోవడమే నిజమైన జ్ఞానం.

# విజేత దినపత్రిక క్యాలెండర్ ను అవిష్కరించిన బీజేపీ నాయకులు



**విజేత,రాయికోడ్:** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలకేంద్రంలో గురువారం మాజీ ఎంపీపీ,బీజేపీ నాయకులు సిర్గపురం మొగులప్ప,ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి సందీప్ గౌడ్,బీజేపీ రాయికోడ్ మండలాధ్యక్షుడు కోడూరి నాగరాజ్,ఉపాధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్,బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బి.నర్సింలు, బీజేవైఎం మండలాధ్యక్షుడు శ్రీకాంత్ చేతులమీదుగా గురువారం విజేత దినపత్రిక 2026 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు శ్రీనివాస్ రెడ్డి, మోహన్,నాగరాజ్,క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల ప్రహరీగోడ నిర్మాణానికి భూమిపూజచేసిన నాయకులు,అధికారులు





**విజేత,రాయికోడ్ :** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం మహాబాత్ పూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రహరీగోడ నిర్మాణానికి గురువారం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఆర్.క్రిష్ణ ఆధ్వర్యంలో ఏఈ దేవయ్య,గ్రామ సర్పంచ్ లక్ష్మణ్,ఉప సర్పంచ్ విజయ్ కుమార్ చేతులమీదుగా పూజాకార్యక్రమం నిర్వహించి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు,పంచాయతీ కార్యదర్శి అనిత,గ్రామస్తులు పాల్గొన్నారు.

# రేగుల గండి గ్రామంలో రహదారి కరెంటు మంచినీళ్లు సౌకర్యం కల్పించాలని

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి వినతి

సిపిఎం మండల కమిటీ సభ్యులు గుండి భీమయ్య.



**విజేత, పినపాక :** రేగుల గండి గ్రామంలో సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి గ్రామస్తుల ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన దరఖాస్తు ఇచ్చారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామానికి కావలసినటువంటి కరెంటు సదుపాయం. రహదారి మంచినీళ్లు సిసి రోడ్లు ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. గుండి భీమయ్య మాట్లాడుతూ గ్రామంలో సుమారు 20 నుంచి 25 సంవత్సరాల నుంచి సమస్యల అధికారులకు, రాజకీయ పార్టీ నాయకులకు చెప్పామని ఈ ఒక్కరు కూడా తమ సమస్యలు పరిష్కరించట్లేదని ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించి గ్రామానికి న్యాయం చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్. వార్డు 16నెంబరు గుండి దేవా శాఖ కార్యదర్శి గుండి రమేష్. కారం భీమయ్య మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

# క్రీడలతో ప్రపంచ స్థాయి గుర్తింపు

ఉన్నత చదువులతో పాటు క్రీడలపై దృష్టి సారించాలి

గోపాల్పేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించిన

వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి



**విజేత రేవల్లి వనపర్తి ప్రతినిధి :** క్రీడలతో ప్రపంచ స్థాయి గుర్తింపును పొందవచ్చునని, మానసికోల్లాసం తో పాటు, దేహదారుఢ్యం సమకూరుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.గోపాల్పేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి జవీ క్రికెట్ క్రీడా పోటీలను గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కార్ రాష్ట్రవ్యాప్తంగా క్రీడలకు ఎంతో ప్రాధాన్యత నిస్తోందని, క్రీడాకారులు ఈ సదా వకాశాన్ని వినియోగించుకుని గొప్ప క్రీడాకారులుగా పేరు తెచ్చుకోవాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి గారు పేర్కొన్నారు.80 కిలోమీటర్ల వేగంతో పరిగెత్తే జింకను, 60 కిలోమీటర్ల వేగంతో పరిగెత్తే పులి వేటాడి చంపుకుని తింటుందని.జింక భయంతో వెనకకు చూస్తూ పరిగెత్తుతుండడంతో పులి సులభంగా జింకను పట్టుకుంటుందని.విద్యార్థులు కూడా వారి లక్ష్యాన్ని నిర్ధారించుకొని ప్రత్యర్థులు ఎంత సమర్థులైన మీరు కూడా పులిలా లక్ష్యాన్ని చేరుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

# కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సార్వత్రిక సమ్మె






**విజేత,, పినపాక :** కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సార్వత్రిక సమ్మెను పినపాక మండలంలో కార్మిక--కర్షక సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. దేశవ్యాప్తంగా కార్మిక హక్కులు, రైతు సంక్షేమం, ప్రజా రంగ సంస్థల పరిరక్షణ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఈ సమ్మె చేపట్టినట్లు సంఘాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పినపాక మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, అనంతరం తాసిల్దార్ కార్యాలయం ఎదుట భారీగా చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, కార్మిక చట్టాలలో చేసిన మార్పులను రద్దు చేయాలని, రైతులకు కనీస మద్దతు ధర హామీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు దుబ్బ గోవర్ధన్, సిఐటీయూ నాయకురాలు సోనా మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు సామాన్య ప్రజలకు, ముఖ్యంగా కార్మికులు మరియు రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల వేలాది మంది ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు తగిన నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. కార్మిక--కర్షక సంఘాల ఐక్య పోరాటం ద్వారానే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, అవసరమైతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. అనంతరం తాసిల్దార్ గోపాలకృష్ణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు, కార్మికులు, రైతులు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం శాంతియుతంగా కొనసాగింది.

# నంది హిల్స్ లో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్





పలు సమస్యలు గుర్తింపు

వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు

**విజేత రేవల్లి వనపర్తి ప్రతినిధి :** వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి గురువారం వనపర్తి పట్టణంలోని నంది హిల్స్ 30 వ వార్డులో మార్నింగ్ వాక్ చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీవాసులతో కలిసి నడక సాగించారు.నంది హిల్స్ పార్కులో నిర్మిస్తున్న సామూహిక భవన నిర్మాణ పనులను పరిశీలించారు.టిఎంఆర్ స్విమ్మింగ్ పూల్ ప్రాంతంలోని రోడ్ల వెంట నడక సాగించిన ఎమ్మెల్యే ఆ ప్రాంతంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని చెప్పారు.కరెంటు స్తంభాలు, వీధిలైట్ల ఏర్పాటు, మురికి కాలువలను నిర్మాణం లాంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి కాలనీని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. వనపర్తి లో రాజకీయాలకి అతీతంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, పట్టణాభివృద్ధిలో రాజకీయాలు ఒక చిన్న భాగమే తప్ప అభివృద్ధికి ఆటంకాలు కాకూడదన్న సంకల్పంతో ముందుకెళుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు స్థానిక పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ ఎన్నికలలో 24 స్థానాలకు 16 స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు త్యాళ్లపల్లి కృష్ణ.

**విజేత, ఇబ్రహీంపట్నం :-** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఎన్నికలలో మల్ రెడ్డి రంగారెడ్డి అధ్యక్షతన 24 స్థానాలకు గాను 16 స్థానాలు కైవసం చేసుకొనునట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు త్యాళ్లపల్లి కృష్ణ తెలిపారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఎన్నికలలో 24 స్థానాలకు 16 స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోబోతుంది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అభివృద్ధి కొరకై 285 కోట్ల రూపాయలు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించి ఇబ్రహీంపట్నం హైదరాబాద్ మాదిరిగా మార్చడానికి ఇబ్రహీంపట్నం ప్రజలు హైదరాబాద్ లో నివసిస్తున్నామనే భావన కలిగేలాగా అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో ఇబ్రహీంపట్నం చౌరస్తా నుండి ఆక్టోపస్ రోడ్డు విస్తరణం డివైడర్ తో రోడ్డు కలకలలాడబోతుంది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఆసుపత్రిని 100 కోట్ల రూపాయలతో నేమ్స్, అపోలో హాస్పటల్ ను తలదన్నేలా ఉండాలని మంచి ఆలోచనతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రజలకు ఉచితంగా వైద్యం అందించాలని ఆలోచనతో పనులు ప్రారంభింపజేశారు. ఇబ్రహీంపట్నం రిజిస్ట్రేషన్ కార్యాలయంను ఇబ్రహీంపట్నం నుంచి మార్చాలని ఒక ఆలోచన వచ్చిన ప్రభుత్వానికి ఇబ్రహీంపట్నం నుండి రిజిస్ట్రేషన్ ఆఫీస్ ని మీరు తొలగించొద్దని ఇబ్రహీంపట్నం ప్రజలకు ఇబ్బంది జరుగుతుందని ఆలోచనతో ప్రజల కోరిక మేరకు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోనే కోటి రూపాయలు సాంక్షన్ చేసి రిజిస్ట్రేషన్ ఆఫీస్ పనులు, పాత ఇబ్రహీంపట్నంను ఎమ్మెల్యే రూపురేఖలు మారే విధంగా మళ్లీ పాత ఊరు కొత్త ఊరుగా మారేలా తీర్చిదిద్దుతున్నారు. ఇబ్రహీంపట్నంలో ఉన్న పాత విజయ సినిమా థియేటర్ ని తొలగించి ఒక మినీ ఫంక్షన్ హాల్ ని ఏర్పాటు చేయాలని పేద ప్రజలకు ఉచితంగా ఫంక్షన్ లు చేసుకోవడానికి అవకాశం కల్పించాలని దాన్ని కూడా త్వరలో ప్రారంభిస్తానని చెప్పడం జరిగింది. అదేవిధంగా ఎమ్మార్వో కార్యాలయాన్ని ఎంతో బ్రహ్మాండంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా రెవెన్యూ పనులు జరిగిపోవాలని మంచి భవనం నిర్మాణం చేయించినారు. ఇంత అభివృద్ధి చేసిన ఏకైక ఎమ్మెల్యే మల్ రంగారెడ్డిని దృష్టిలో పెట్టుకొని ఇబ్రహీంపట్నం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపిస్తున్నారని త్యాళ్లపల్లి కృష్ణ తెలిపారు. అదే విధంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు వారి సమయాన్ని వేచించి కాంగ్రెస్ పార్టీ



అభ్యర్థులను గెలిపించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# సిద్దార్థ కళాశాలలో విద్యార్థుల సాంకేతిక ప్రతిభకు వేదికగా నేషనల్ టెక్ సింపోజియం





**విజేత, ఇబ్రహీంపట్నం :-** సిద్దార్థ కళాశాలలో జరిగిన నేషనల్ లెవెల్ టెక్నికల్ సింపోజియంలో ముఖ్య అతిధిగా హాజరైన ఏ.ప్రదీప్ రెడ్డి, టాస్క్ ప్రోగ్రామ్ మేనేజర్, మాట్లాడుతూ... ఇలాంటి సింపోజియాలు విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో నూతన ఆలోచనలు, సృజనాత్మకతను ప్రేరేపించడంలో చాలా ముఖ్యమైనవి. ఇక్కడ జరిగిన పేపర్ ప్రెసెంటేషన్స్, టెక్నికల్ క్విజ్‌లు, లైవ్ ప్రాజెక్ట్ ప్రదర్శనలు యువతలో ఆవిష్కరణాత్మకతను ప్రేరేపిస్తాయి," అని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ బాబు మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధిలో అకడమిక్స్‌తో పాటు నైపుణ్యాల అభివృద్ధికి కూడా సమాన ప్రాముఖ్యత ఉందని వెల్లడించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానం మాత్రమే కాకుండా, ప్రాక్టికల్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, మరియు సాంకేతిక పరిజ్ఞానం కూడా విద్యార్థుల భవిష్యత్తు విజయానికి కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. మన టెక్నికల్ ఫెస్టివల్ కోసం రూపొందించిన ఆహ్వాన లెటర్ చాలా ఇన్నోవేటివ్‌గా తయారుచేశారాని, ఈ సృజనాత్మకత విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించడంలో మరియు కళాశాల ప్రతిష్టను పెంపొందించడంలో చాలా ముఖ్యంగా ఉంటుంది," అని కళాశాల డైరెక్టర్ జీ భగవత్ గారు తెలిపారు. కళాశాల సెక్రెటరీ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ గెలుపొందిన విద్యార్థులు, నిర్వాహకులను అభినందించారు. విజయం సాధించిన ప్రతి విద్యార్థి, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులను ప్రశంశించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ సింపోజియం కన్వీనర్స్ డాక్టర్ కృష్ణార్జున రావు, ప్రొఫెసర్ శంకర్, హెచ్ఓడీలు, ఫాకల్టీ మెంబర్ లు, వివిధ కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పుట్టా నరేష్ కు నివాళులర్పించిన మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు





**విజేత ఖమ్మం :** అన్నారుగూడెం గ్రామంలో పుట్టా నరేష్ ఇటీవల మృతి చెందారు. గురువారం నరేష్ దశదిన కార్యక్రమం అన్నారుగూడెంలో వారి స్వగృహంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు హాజరై నరేశ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆ గ్రామ ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు,వార్డ్ మెంబర్ సూదా హనుమంతురావు, బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు దొడ్డ చిన్న శ్రీనివాస రావు,నాయకులు పొన్నం కృష్ణయ్య, సూదా నాగేశ్వరరావు, నరసింహారావు.తదితరులు పాల్గొన్నారు.

# "సిద్దార్థ కళాశాలలో విద్యార్థుల సాంకేతిక ప్రతిభకు వేదికగా నేషనల్ టెక్ సింపోజియం"



**విజేత ఖమ్మం :** సిద్దార్థ కళాశాలలో జరిగిన నేషనల్ లెవెల్ టెక్నికల్ సింపోజియంలో ముఖ్య అతిధిగా హాజరైన ఏ. ప్రదీప్ రెడ్డి, టాస్క్ ప్రోగ్రామ్ మేనేజర్, మాట్లాడుతూ, "ఇలాంటి సింపోజియాలు విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో, నూతన ఆలోచనలు మరియు సృజనాత్మకతను ప్రేరేపించడంలో చాలా ముఖ్యమైనవి. ఇక్కడ జరిగిన పేపర్ ప్రెసెంటేషన్స్, టెక్నికల్ క్విజ్‌లు మరియు లైవ్ ప్రాజెక్ట్ ప్రదర్శనలు యువతలో ఆవిష్కరణాత్మకతను ప్రేరేపిస్తాయి," అని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ బాబు మాట్లాడుతూ, విద్యార్థుల అభివృద్ధిలో అకడమిక్స్‌తో పాటు నైపుణ్యాల అభివృద్ధికి కూడా సమాన ప్రాముఖ్యత ఉందని వెల్లడించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానం మాత్రమే కాకుండా, ప్రాక్టికల్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, మరియు సాంకేతిక



పరిజ్ఞానం కూడా విద్యార్థుల భవిష్యత్తు విజయానికి కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. మన టెక్నికల్ ఫెస్టివల్ కోసం రూపొందించిన ఆహ్వాన లెటర్ చాలా ఇన్నోవేటివ్‌గా తయారుచేశారాని, ఈ సృజనాత్మకత విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించడంలో మరియు కళాశాల ప్రతిష్టను పెంపొందించడంలో చాలా ముఖ్యంగా ఉంటుంది," అని కళాశాల డైరెక్టర్ జీ భగవత్ గారు తెలిపారు.కళాశాల సెక్రెటరీ డాక్టర్ డి. ప్రదీప్ కుమార్ గెలుపొందిన విద్యార్థులు మరియు నిర్వాహకులను అభినందించారు. కళాశాలలో జరుగుతున్న అన్ని కార్యక్రమాల్లో పాల్గొని విజయం సాధించిన ప్రతి విద్యార్థి, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులను ప్రశంశించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ సింపోజియం కన్వీనర్స్ డాక్టర్ కృష్ణార్జున రావ్, ప్రొఫెసర్ శంకర్, హెచ్ఓడీస్, ఫాకల్టీ మెంబర్స్, మరియు వివిధ కళాశాలల స్టూడెంట్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ అనాథాశ్రమంలో సేవా కార్యక్రమాలు





**అక్షర విజేత, దుండిగల్ :-** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ 24వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు సందర్భంగా దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా దుండిగల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది జాతీయ జెండాను గౌరవప్రదంగా ఎగురవేసి కమిషనరేట్ స్థాపన దినోత్సవాన్ని సాదరంగా జరుపుకున్నారు.ఈ వేడుకల భాగంగా సామాజిక సేవా కార్యక్రమాలను కూడా నిర్వహించారు. డి-పోచంపల్లి ప్రాంతంలోని పల్లవి అనాథాశ్రమం, వృద్ధులు, మానసిక వికలాంగుల ఆశ్రమాన్ని పోలీస్ సిబ్బంది సందర్శించారు. అక్కడ ఉన్న 55 మంది అనాథలు, వృద్ధులు, మానసిక వికలాంగులకు దుస్తులు మరియు పండ్లు పంపిణీ చేశారు.అంతేకాకుండా ఆశ్రమవాసులతో కలిసి కేక్ కట్ చేసి వారి మధ్య ఆనందాన్ని పంచుకున్నారు. పోలీసుల ఈ సేవా కార్యక్రమం అక్కడి వారిలో ఆనందం నింపడమే కాకుండా, మానవతా విలువలకు ఒక మంచి ఉదాహరణగా నిలిచింది.సమాజానికి సేవ చేయడం కూడా మన బాధ్యత. ఇలాంటి సేవా కార్యక్రమాలు మనకు హృదయపూర్వక అనుభూతిని కలిగిస్తాయి" సీఐ సతీష్ తెలిపారు.ఈ వేడుకలు మరియు సేవా కార్యక్రమాలు పోలీస్-ప్రజల మధ్య బంధాన్ని మరింత బలపరిచాయి. ఈ కారిక్రమంలో దుండిగల్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే మెగా రెడ్డి









**విజేత రేవల్లి వనపర్తి ప్రతినిధి :** వనపర్తి జిల్లా గోపాల్పేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పరిశీలించారు. సన్నబియ్యంతో వండిన అన్నంతో పాటు, పప్పు కూరగాయలను, రాగిజావను ఆయన చూశారు. విద్యార్థులకు తయారుచేసే భోజనం పట్ల అశ్రద్ధ వహించరాదని.ఎప్పటికప్పుడు తాజా కూరగాయలతో నాణ్యవంతమైన భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలని ఆయన అధికారులకు, పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యాభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో మార్పులను తీసుకువచ్చిందని విద్యా వ్యవస్థను బలోపేతం చేసి తెలంగాణకు బంగారు భవిష్యత్తును అందించేందుకు ముందుకెళుతున్నట్టు ఆయన చెప్పారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 1న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక

### ఖమ్మంలో భారతరత్న అటల్ బిహారి వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలు

**విజేత ఖమ్మం :** మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారి వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలు మార్చి 1న ఖమ్మంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు అటల్ బిహారి వాజ్ పేయి ఉత్సవ కమిటీ అధ్యక్షులు దుద్దుకూరి వెంకటేశ్వర్లు తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దుద్దుకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా మాజి ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఖమ్మం వస్తున్నారని, వారితోపాటు ప్రముఖ కవి, రచయిత, ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ ఆచార్యులు కసిరెడ్డి వెంకటరెడ్డి, అఖిలభారత సామాజిక సమరసత కళావిభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్, రాష్ట్ర మంత్రులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ఖమ్మం





ఎస్సార్ గార్డెన్ లో జరిగే అటల్ బిహారి వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలలో 'అటల్ జీకి అక్షర నీరాజనం కవితా సంకలనం' పుస్తక ఆవిష్కరణ ఉంటుందన్నారు. భారతదేశాన్ని ప్రగతి బాటలో నడిపిన మహా నాయకుడు వాజ్ పేయి అని, వారు చూపిన మార్గాన్ని భావితరాలకు చేరేవిధంగా శతజయంతి వేడుకలను ఖమ్మంలో ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మందడపు ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వడ్లమూడి సురేష్, కోశాధికారి మల్లెంపాటి రమేష్, కార్యదర్శులు యలమందల మధు, బోళ్ల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# శివరాత్రి మహోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు



భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్





**విజేత, గణపురం :** గణపురం మండల కేంద్రంలోని శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 15న కోటగుళ్లలో నిర్వహించే శివ కళ్యాణ మహోత్సవానికి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు.గురువారం ఆయన కోటగుళ్లను సందర్శించారు.ఈ సందర్భంగా కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆలయంలో స్వామివారికి ఎస్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాలను పరిశీలించారు.గోశాలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.మహాశివరాత్రి వేడుకల సందర్భంగా ఆలయం వద్ద చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు (బందోబస్తు) పై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రద్దీని దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆలయ చిత్రాన్ని బహుకరించారు.ఆయన వెంట భూపాలపల్లి డి.ఎస్.పి అవిరి నేని సంపత్ రావు,గణపురం సిఐ కరుణాకర్ రావు,ఎస్ఐ రేఖ అశోక్ తదితరులు ఉన్నారు.

# సమన్వయంతో మహా శివరాత్రి జాతర విజయవంతం చేయాలి

### ఇంచార్జి కలెక్టర్, మహా శివరాత్రి జాతర కమిటీ చైర్ పర్సన్ గరిమ అగ్రవాల్

**విజేత,రాజన్న సిరిసిల్ల ప్రతినిధి,:** మహా శివరాత్రి జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించి.. విజయవంతం చేయాలని ఇంచార్జి కలెక్టర్, మహా శివరాత్రి జాతర కమిటీ చైర్ పర్సన్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో మహా శివరాత్రి జాతర సందర్భంగా అన్ని శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్, మహా శివరాత్రి జాతర కమిటీ చైర్ పర్సన్ గరిమ అగ్రవాల్ గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమేశ్వర ఆలయంలో మహా శివరాత్రి జాతర సందర్భంగా భక్తులు స్వామి వారి దర్శనాన్ని సౌకర్యంగా చేసుకునేలా తుది దశ ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్ లు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. జడ్పీ డిప్యూటీ సీఈఓ, వేములవాడ మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి సంయుక్తంగా ఆలయ పరిసరాలు, పార్కింగ్ స్థలాలు, క్యూ లైన్లు ఇతర చోట్ల మూడు షిఫ్టులో సిబ్బంది ఉండేలా చూడాలని ఆదేశించారు. జాతరకు ముందు నుంచి తరువాత మూడు రోజుల వరకు పారిశుధ్య సేవలు అందించాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆధ్వర్యంలో బస్సు స్టాండ్, పార్కింగ్ స్థలాలు, ఇతర చోట్ల పూర్తి వివరాలతో హెల్ప్ డెస్క్ లు సిబ్బంది అందుబాటులో పెట్టాలని, ప్రతి చోట అన్ని వివరాలతో కూడిన సైన్



బోర్డులు పెట్టించాలని తెలిపారు. ఆలయంలోని క్యూల వద్ద, పార్కింగ్ స్థలాల వద్ద, బస్సు స్టాండ్లలో తాగు నీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. సెస్ అధికారులు భీమేశ్వర ఆలయం, బద్ది పోచమ్మ ఆలయం, ఇతర చోట్ల 24 గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు కూడా చేసుకోవాలని, అధికారులు, సిబ్బంది ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖా ఆధ్వర్యంలో భీమన్న ఆలయం, ప్రసాదం కౌంటర్, పార్కింగ్ స్థలాలు ఇతర చోట్ల వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్ లతో సిద్ధంగా ఉండాలని వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా, అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అగ్ని మాపక శాఖా అధికారులు ప్రధాన ఆలయాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు చెక్ చేయాలని, వారి సిబ్బంది గుడి ఆవరణలో జాతర సమయంలో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు భక్తులకు అందించే ప్రసాదం, ఇతర ఆహార పదార్థాలను పరిశీలించాలని ఆదేశించారు. క్యూ లైన్లు, వీఐపీలు, కళ్యాణ కట్ట, ఇతర చోట్ల రద్దీ నియంత్రణ, దర్శనం పూర్తి చేసేందుకు జిల్లా స్థాయి అధికారులను నియమించామని, వారు ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలిపారు. కోడెల నిర్వహణ, సంరక్షణ జిల్లా పశు సంవర్ధక శాఖ, ఆలయ అధికారులు సమన్వయంతో చూసుకోవాలని ఆదేశించారు. జాతర ఆవరణలో ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా చూడాలని సూచించారు. వృద్ధులు,దివ్యాంగులకు సహాయం కోసం వీల్ చైర్లు వాలంటీరను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతర విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి కావాల్సిన గదులు, ఆహారం, ఇతర సదుపాయాలు వేములవాడ ఆర్డీఓ, ఆలయ అధికారులు చూసుకోవాలని సూచించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎక్కడా దర్శనం, వసతులలో ఇబ్బందులు రాకుండా చూడాలని స్పష్టం చేసారు. మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని, వీఐపీ, వీవీఐపీల దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్ లో ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, ఆలయ ఈఓ రమాదేవి తదితరులు ఉన్నారు.

# తోటి జర్నలిస్టు కుటుంబానికీ ఆర్థిక చేయూత



**విజేత, తల్లాడ :** ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన రిపోర్టర్ సురేష్ ఇటీవలే గుండె నొప్పితో మరణించగా గురువారం వారి స్వగృహం నందు నిర్వహించిన ఆత్మీయ వేడుకల తల్లాడ ఐజేయు మండల కమిటీ ఆధ్వర్యంలో రిపోర్టర్ సురేష్ కుటుంబానికి తమ వంతు సహాయం అందించాలని ఉద్దేశంతో ఆర్థిక సహాయం అందించారు. అనంతరం అధ్యక్షులు బహుదూర్, గౌరవ అధ్యక్షులు ప్రసన్నన్, దాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ రిపోర్టర్లు సమాజ సేవకై ప్రజల పక్షాన పోరాడుతూ ఆర్థికంగా చాలా వెనుకబడి కుటుంబ పోషణ భారమై అనేక గడ్డు పరిస్థితిలో ఎదుర్కొంటున్న తరుణంలో కుటుంబ పెద్ద మరణించడం కుటుంబానికి తీరని లోటు అని మృతి చెందిన రిపోర్టర్ సురేష్ కుటుంబానికి అన్నివేళలా తోడుగా ఉంటామని మృతుని భార్యకు తెలియజేశారు. ప్రసన్నన్ మాట్లాడుతూ మృతి చెందిన తోటి జర్నలిస్టు సురేష్ పిల్లలకు తమ విద్యాలయం నందు ఉచిత విద్య అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మండల కమిటీతో కలిసి సురేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు దేవబత్తిని సీతారాములు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, వేము విజయ్, ఇశ్నేపల్లి శ్రీనివాస రావు, గొలమందుల ప్రేమ్ కుమార్, నారపోగు ప్రసాద్, గోడ్ల బాబురావు, గోడ్ల నరసింహారావు, బోనాసి శ్రీనివాసరావు, కంపాటి రవి, రేగళ్ల శ్రీనివాసరావు, కొత్తపల్లి విజయ్ పాల్గొన్నారు.

# ప్రమాద బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



**విజేత రేవల్లి వనపర్తి ప్రతినిధి :** వనపర్తి పట్టణం హరిజనవాడకు చెందిన యువకుడు నవీన్ కు హైదరాబాద్ గచ్చిబౌలి ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తన ఎడమ చేయి వెనుక విరిగిపోయింది.దాంతో బాధితుడు వనపర్తి లోని సుధా నర్సింగ్ హోమ్ లో చికిత్స పొందుతున్నాడు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం సుధా నర్సింగ్ హోమ్ లో చికిత్స పొందుతున్న యువకుడు నవీన్ ను పరామర్శించి ప్రమాదానికి గాల కారణాలను అడిగి తెలుసుకున్నారు.ఔటర్ రింగ్ రోడ్డుపై తాను బైకు మీద ప్రయాణం చేస్తున్నప్పుడు వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో కింద పడ్డారని దాంతో ఎడమ చేయి విరిగిపోయినట్లు బాధితులు వాపోయాడు.ఈ సందర్భంగా సుధా నర్సింగ్ హోమ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పగిడాల శ్రీనివాస్ గారితో ఎమ్మెల్యే మాట్లాడారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని, ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాల్సిందిగా ఆయన సూచించారు.కార్యక్రమంలో గంధం నాగరాజు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం





**విజేత కొవ్వూరు ;** తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం కొవ్వూరు మండలం లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మట్టా సత్యనారాయణ భార్య శ్రీలక్ష్మి కి ఐ పంగిడి గ్రామానికి చెందిన చౌటుపల్లి శివ పదివేల రూపాయలు, ఉన్నత పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు 30 వేల రూపాయలు మొత్తం 40 వేల రూపాయలను గురువారం సాయంత్రం దేచర్ల గ్రామం లోని వారి ఇంటి వద్ద అందజేశారు. వీరి పిల్లలు ఐ పంగిడి ఉన్నత పాఠశాలలో మట్టా దైవ కృప తొమ్మిది, హేమశ్రీ ఏడవ తరగతి చదువుతున్నారు. చదువు లో చురుకుగా తెలివితేటలూ కల్గిన వీరికి కుటుంబ పోషకుడైన తండ్రి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవడంతో కుటుంబం వీధిన పడింది. ఇది పురస్కరించుకొని ఐ.పంగిడి గ్రామంలోని చౌటుపల్లి శివ పదివేల రూపాయలు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థినీ,విద్యార్థులు విరాళాలు గా 30,000సేకరించారు. అత్యంత పేదరిక స్థితిలో ఉన్న ఈ కుటుంబానికి భరోసా కల్పిస్తూ విరాళాలను అందించామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగని శ్రీరామారావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వి. పార్వతీ పరమేశ్వర శాస్త్రి, సుసన్నారాణి, పి.వి. రవికుమార్, వి. అచ్చయ్య తదితరులు కుటుంబాన్ని దర్శించి ధైర్యాన్ని ఇచ్చారు. గతంలో ఇదే కుటుంబానికి కూటమి నాయకులు కూడా 35, వేల రూపాయలు విరాళం గా అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఐ. పంగిడి విద్యాసంస్థల దాత్రుత్వం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

# అబ్దుల్లాపూర్ మెట్ కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ.

### 2 కోట్ల 25 లక్షల 26 వేల చెక్కులు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పంపిణీ.



**విజేత, ఇబ్రహీంపట్నం :-** అబ్దుల్లాపూర్ మెట్ లో 2 కోట్ల 25 లక్షల 26 వేల చెక్కులు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పంపిణీ చేశారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలోని గురువారం మధ్యాహ్నం శివ గార్డెన్స్ లో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండలం పరిధిలోని 225 మంది కల్యాణ లక్ష్మి, షాధిముభారక్ లబ్ధిదారులకు సుమారు 2 కోట్ల 25 లక్షల రూపాయల 26 వేల రూపాయల విలువ గల చెక్కులను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పంపిణీ చేశారు. అనంతరం మండలలోని సర్పంచులు అధికారులతో కలసి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డితో పాటు సంబంధిత వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి భరోసాగా: 10 వేల విరాళం అందజేత




**విజేత, ములకలపల్లి :** మానవత్వం చాటుకున్న ప్రగతిశీల యువజన సంఘం (పి వై ఎల్) నాయకులు మరియు యువకులు, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న బాధితురాలికి ఆర్థిక భరోసానిచ్చారు. ఈ నెల 5వ తేదీన మాదారం సమీపంలో జరిగిన ఆటో-లారీ ప్రమాదంలో కారం సంధ్య అనే మహిళ తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆమె ఖమ్మంలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక స్థితిగతులు అంతంతమాత్రంగా ఉండటంతో వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్న సంధ్య కుటుంబ పరిస్థితిని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న బాధితురాలి పరిస్థితిపై చలించిన పి వై ఎల్ ఖమ్మం జిల్లా నాయకులు గొడ్డేటి అశోక్, పాత గంగారం సర్పంచ్ సోడె చైతన్య, మరియు సత్తుపల్లి రుద్రాక్షపల్లి పంచాయతీ బాచారం గ్రామానికి చెందిన యువకులు కలిసి 10,వేలు నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో (పి వై ఎల్) నాయకులతో పాటు బాచారం గ్రామానికి చెందిన యువకులు సారా అజయ్ గుండ్ల ఆది పద్దం సత్తిబాబు సార కార్తీక్ మరియు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, సంధ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితురాలి కుటుంబ సభ్యులు తమకు అండగా నిలిచిన యువతకు కృతజ్ఞతలు తెలిపారు.

## సార్వత్రిక సమ్మెకు ఎ జి పి ఏ టి సంఘీభావం




**విజేత ఖమ్మం :** కార్మిక, కర్షక, ఉద్యోగ, పెన్షనర్ల హక్కులు కాలరాసే చట్టాలు రద్దుచేయాలని జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు గురువారం జరుగుతున్న జాతీయ సార్వత్రిక సమ్మెకు ఎస్జిపిఏటి మద్దతుగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వ నాలుగు లేబర్ కోడ్లు రద్దుచేయాలని, పాత పెన్షన్ విధానం అమలుచేయాలని, రైతాంగాన్ని దెబ్బతీసే విత్తనబిల్లు, విద్యుత్ సవరణబిల్లు తదితర బిల్లులు రద్దుచేయాలని జాతీయ కార్మిక సంఘాలు ఆందోళన బాట పట్టగా బాసటగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కృషిభవన్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. పెన్షనర్ల సంఘీభావ ర్యాలీకి ఎస్జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య, ప్రధాన కార్యదర్శి రాయలరవికుమార్ నాయకత్వం వహించగా, ర్యాలీ లో పెదమళ్ళసత్యనారాయణ, కొలికొండశరత్ బాబు, ఊడుగువెంకటేశ్వర్లు, ప్రసాదరావు, నాగప్రసాద్, సుధాకర్,హుస్సేన్, యం రామారావు,అశోక్ కుమార్, వెంకటేశ్వర్లు, వీరభద్రరావు,తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి సందర్భంగా దేవరకొండ నుంచి శ్రీశైలం కు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు





**విజేత, దేవరకొండ :** దేవరకొండ ఆర్టీసీ డిపో నుంచి మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ విజయకుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవరకొండ నుంచి ఈనెల 14,15,16 తేదీల్లో రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపిస్తున్నట్లు చెప్పారు. ఎక్స్ప్రెస్ బస్సు ఛార్జీలు పెద్దలకు రూ.440, పిల్లలకు రూ.250, డీలక్స్ బస్సులకు రూ.500, పిల్లలకు రూ.280 ఛార్జీలు వర్తిస్తాయని తెలిపారు. మహిళలకు మహాలక్ష్మి పథకం పాతాళ గంగ వరకు వర్తిస్తుందన్నారు. దేవరకొండ ప్రాంత భక్తులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

## విద్యార్థులకు కెరీర్ మార్గదర్శనం బీకేఆర్ ఫౌండేషన్ ముందడుగు



**అక్షర విజేత, దుండిగల్ :-** దుండిగల్ సర్కిల్ బహదూర్‌పల్లి బీకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, బహదూర్‌పల్లిలో కెరీర్ గైడెన్స్ ఉ మోటివేషన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి లెర్నింగ్ లైట్స్ ఇనిషియేటివ్ మరియు సహజ ఫౌండేషన్ సంస్థలు సహకారం అందించాయి.ఈ సందర్భంగా నిపుణులు విద్యార్థులతో సంభాషిస్తూ వివిధ కెరీర్ అవకాశాలు, ఉన్నత విద్య మార్గాలు, పోటీ పరీక్షల సిద్ధత విధానాలు మరియు లక్ష్య నిర్ధారణ వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. పాఠశాల విద్య దశ నుంచే స్పష్టమైన లక్ష్యం పెట్టుకొని క్రమబద్ధంగా చదివితేనే విజయం సాధ్యమవుతుందని వారు తెలియజేశారు.విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా మోటివేషనల్ స్పీచ్‌లు నిర్వహించబడగా, కష్టపడితే ఏ రంగంలోనైనా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ప్రేరణనిచ్చారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా పట్టుదలతో ముందుకు సాగితే పెద్ద స్థాయిలో అవకాశాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, విద్యార్థుల భవిష్యత్ రూపకల్పనలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపి, తమ భవిష్యత్‌పై స్పష్టత కలిగించిన ఒక స్ఫూర్తిదాయక వేదికగా నిలిచింది.

## కోటగుళ్లు శివరాత్రి మహోత్సవాలకు కలెక్టర్, ఎస్పీలకు ఆహ్వానం





**విజేత, గణపురం :** గణపురం మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో ఈనెల 15న మహా శివరాత్రి మహోత్సవాలకు భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్ లను కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆహ్వాన పత్రిక అందజేసారు. అదేవిధంగా భూపాలపల్లి డి.ఎస్.పి అవిరి నేని సంపత్ రావు, చిట్యాల సిఐ మల్లేష్ భూపాలపల్లి సిఐ దొమ్మాటి నరేష్ కుమార్ లకు ఆహ్వాన పత్రికలు అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు అందజేశారు.

# మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత

### సిపి గౌష్ ఆలం

**విజేత,కరీంనగర్ ప్రతినిధి: :** కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తును మోహరించినట్లు ఆయన పేర్కొన్నారు.

**ప్రధాన భద్రతా చర్యలు మరియు నిబంధనలు:**

**మూడంచెల భద్రత:** కౌంటింగ్ కేంద్రం చుట్టూ మూడు స్థాయిల్లో భద్రతను ఏర్పాటు చేశాం. కేంద్రానికి 100 మీటర్ల దూరం నుండే భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసి, అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నిషిద్ధం చేశామని సీపీ తెలిపారు.

**ప్రవేశ మార్గాల కేటాయింపు:**

**మొదటి గేట్:** కేవలం పోలీసు అధికారులు, మున్సిపల్ అధికారులు మరియు విధుల్లో ఉన్న సిబ్బందికి మాత్రమే అనుమతి.

**రెండవ గేట్:** అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు మరియు మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ప్రవేశం కల్పించడమైనది. వీరందరూ తప్పనిసరిగా గుర్తింపు కార్డులు కలిగి ఉండాలి.






**ట్రాఫిక్ దారి మళ్లింపు:** ఓట్ల లెక్కింపు కేంద్రాల వైపు వచ్చే వాహనాల వల్ల ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందస్తుగా దారి మళ్లింపు చర్యలు చేపట్టాం. జగిత్యాల-కరీంనగర్ మార్గంలో ప్రయాణించే వారు పోలీసుల సూచనలు పాటించాలన్నారు.

**పార్కింగ్ సౌకర్యం:** కౌంటింగ్ కేంద్రానికి వచ్చే వాహనాల కోసం నిర్ణీత దూరంలో ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించడమైనది. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

**నిరంతర నిఘా:** కౌంటింగ్ కేంద్రం బయట ఎటువంటి గుంపులు ఏర్పడకుండా పుషింగ్ పార్టీలను రంగంలోకి దించామని, నగరవ్యాప్తంగా నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నామని సీపీ తెలిపారు.

**సిపి గౌష్ ఆలం విజ్ఞప్తి:**

ప్రజాస్వామ్యయుతంగా జరుగుతున్న ఈ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ సహకరించాలి. కౌంటింగ్ కేంద్రాల వద్ద సంబరాలు లేదా నిరసనల పేరిట శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు. ఎటువంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతిలేదని, అవి పూర్తిగా నిషేధమని పోలీసు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సీపీ స్పష్టంగా తేల్చిచెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు అన్నారు.




## మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా: కరీంనగర్ నగరంలో ట్రాఫిక్ దారి మళ్లింపు

### ఏసీపీ వెంకటస్వామి విజ్ఞప్తి

**విజేత,కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని, లెక్కింపు కేంద్రాల వద్ద రద్దీని నివారించేందుకు మరియు సామాన్య ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఉండేందుకు నగరంలో ట్రాఫిక్ దారి మళ్లింపు చర్యలు చేపట్టినట్లు టౌన్ ఏసీపీ వెంకటస్వామి తెలిపారు. ఈ ఆంక్షలు ఓట్ల లెక్కింపు ముగిసే వరకు అమలులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. దారి మళ్లింపు వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల నుండి కరీంనగర్ వైపు వచ్చే వాహనాలు: జగిత్యాల నుండి కరీంనగర్ వైపు వచ్చే అన్ని రకాల వాహనాలను రేకుర్తి చౌరస్తా వద్ద మళ్లిస్తారు. ఈ వాహనాలు శాతవాహన యూనివర్సిటీ, కొత్తపల్లి పోలీస్ స్టేషన్ రోడ్ మీదుగా చింతకుంట ద్వారా నగరంలోకి చేరుకోవాల్సి ఉంటుంది. కరీంనగర్ నుండి జగిత్యాల వైపు వెళ్లే వాహనాలు: నగరం నుండి జగిత్యాల వైపు వెళ్లే వాహనాలు తెలంగాణ చౌక్, రామ్ నగర్, పద్మనగర్, చింతకుంట మీదుగా కొత్తపల్లి పోలీస్ స్టేషన్ రోడ్, అక్కడి నుండి శాతవాహన యూనివర్సిటీ, రేకుర్తి చౌరస్తా మీదుగా జగిత్యాల వైపు వెళ్లాలని సూచించారు.

**ఏసీపీ విజ్ఞప్తి:**

ఓట్ల లెక్కింపు సజావుగా సాగేందుకు వాహనదారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఏసీపీ కోరారు. ఎమర్జెన్సీ వాహనాలు మినహా మిగిలిన అన్ని వాహనాలు పైన పేర్కొన్న ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని ఆయన సూచించారు.

# జ్ఞానం ఒక జీవ నది

### ఎవ్వరికీ అన్ని ముందే తెలియవు: డిజె ఎఫ్ డబ్ల్యూ, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్. వడ్డేపల్లి హనుమంతు

**విజేత, హైదరాబాద్ ప్రతినిధి :** డీజే ఎఫ్ డబ్ల్యూ, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్. వడ్డేపల్లి హనుమంతు మాట్లాడుతూ పుట్టినప్పటినుండి మనకి ఊహ వచ్చే వరకు తల్లి చాలా విషయాలు చెబుతుంది. అలా చెప్పింది తెలుసుకోవడం జ్ఞానం.. కొంచెం పెద్దయ్యాక తండ్రి చాలా భౌతిక విషయములు, ఎవ్వరితో ఎలా ఉండాలో చెబుతారు, ఇదొక జ్ఞానం. స్కూల్లో చేరంగానే, ప్రాధమిక జ్ఞానం నుండి అక్షర జ్ఞానం దగ్గరనుండి అనేక విషయాలు నేర్పుతారు..ఉపాధ్యాయులు ఎన్నో విషయాలు చెబుతారు. ఇదొక "జ్ఞానం." తరువాత మిత్రులు, బాల్య మిత్రులు, కళాశాల మిత్రులు, ఉద్యోగ మిత్రులు, ఇలా మిత్రులు మనకి అనేక తెలియని విషయాలు చెబుతారు. ఇదొక జ్ఞానం. వార్తాపత్రికలు, పుస్తకాలు, గ్రంధాలు కొంత 'జ్ఞానం' నేర్పుతాయి. నేర్చుకునే నైపుణ్యం ఉంటే మన అనుభవాలు కొంత జ్ఞానం నేర్పుతాయి. ఇలా 'జ్ఞానం, ఏమి తెలియని మనకి, ఎందరో, తల్లి మొదలుకొని, అనుభావాల వరకు మనకి 'జ్ఞానం' అందిస్తున్న వారే. ఆది గురువు దత్తాత్రేయ స్వామి కూడా తాను 24 గురువుల దగ్గర నేర్చుకొన్నారు అని చెప్పారు. ఇలా 'జ్ఞానం తెలిపే వారు గురువులు, తెలుసుకునే వారు శిష్యులు.

ఐతే ఇదంతా భౌతిక జ్ఞానం వరకే!

ఆధ్యాత్మిక 'జ్ఞానం' కోసం మనకి సద్గురువు అవసరం. ఆయన ఆ జ్ఞానాన్ని సాధన చేసి అనుభవ పూర్వకంగా తెలుసుకొని, ఆ సాధన ఇతరులతో చేయించ గలిగిన నైపుణ్యం కలవారై ఉంటారు. మన అంతరంగం నిష్కామ కర్మలతో, స్వార్థం లేకుండా, మమకారం లేకుండా శుద్ధమైతే, అప్పుడు పరమాత్మ ఒక సద్గురు రూపంలో మన వద్దకు వచ్చి, సాధన మార్గం ఉపదేశించి మనతో సాధన చేయిస్తారు.

**ఇది జ్ఞానం వచ్చే విధానము:**

అయితే జ్ఞానం కావాలి అంటే కొన్ని అర్హతలు కావాలి.

**అవి:**

అన్నీ "నాకే తెలుసు" అన్న భావం ఉండక పోవడము. మనకి జ్ఞానం నేర్పే వ్యక్తి పట్ల విశ్వాసం ఉండాలి. తెలుసుకునే జ్ఞానం పట్ల శ్రద్ధ భక్తి. జ్ఞానం ఒక నిరంతరంగా ప్రవహించే జీవ నది అని, అది తనకు తన గురువు ద్వారా, తన నుండి తనని నమ్మే వారికి వెళుతుంది అని తెలుసుకోవాలి. జ్ఞానానికి "పేటెంట్ రైట్స్" ఉండవు. ఇది నా జ్ఞానం నా అనుమతి లేకుండా, ఇతరులకి చెప్పకూడదు అనుకోవడం పద్ధతి కాదు, ప్రతి ఒక్కరు వారికి తెలిసింది, విన్నది ఇంకొకరికి చెప్పి గురువు కావాలని వారికి ఉండదు, వారిచే మెప్పుదల పొందాలి అనే ఆశ ఉంటుంది. భుజం తట్టి శెభాష్ అనిపించుకోవాలి అని ఉంటుంది.. జ్ఞానం ఒకరినుండి ఇంకొకరికి వెళ్ళిపోతుంది అని గ్రహించాలి. జ్ఞానం ఒక జీవ నది లాంటిది అని తెలుసుకోవాలి..డిజె ఎఫ్ డబ్ల్యూ, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్. వడ్డేపల్లి హనుమంతు తెలిపారు.



## ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్య వ్యవస్థను బలోపేతం చేయాలి

### జిల్లా కలెక్టర్ కె. హైమావతి

**విజేత, సిద్ధిపేట ప్రతినిధి :** ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్య వ్యవస్థను బలోపేతం చెయ్యాలని ఈ విద్య సంవత్సరం లో వచ్చే ఫలితాల ఆధారంగానే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు చేరతారని ప్రతి మండలంలో ఒక ప్రణాళిక రూపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి ను ఆదేశించారు. రాబోయే 10 వ తరగతి విద్యార్థుల బాగా చదివించాలని 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. ప్రత్యేక తరగతులు మరియు స్టడీ హవర్ లో విద్యార్థులకు దగ్గరుండి సబ్జెక్ట్ గూర్చి అవగాహన మరియు సులభంగా ఎలా చదవాలో మెలకువలు నేర్పించాలని తెలిపారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ఎక్కువ శ్రద్ధ తీసుకుని చదివించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం మెనూ తప్పనిసరిగా పాటించాలని విద్యార్థుల హాజరు ప్రకారం అందరికీ సరిపోయే విధంగా వండి రుచికరంగా వండి విద్యార్థులకు భోజనం పెట్టాలని ఆదేశించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం లో సైతం మెను పాటించాలని, కొలత ప్రకారం అన్నం, కూరగాయలు చెయ్యాలని ఆదేశించారు. ఫ్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ వేగం పెంచాలని ఆదాయ, కుల జారీలో ఆలస్యం అవుతున్నందున విద్యార్థుల పత్రాలు వెంటనే జారీ చెయ్యాలని తహసిల్దార్ లను ఫోన్ ద్వారా ఆదేశించారు. మీ సేవ సెంటర్ లో కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలకు అదనపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఈ డి ఎం. ఆనంద్ కి ఫోన్ ద్వారా ఆదేశించారు.





# మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కు పటిష్ట ఏర్పాటు



జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

కౌంటింగ్ ఏజెంట్లకు ప్రత్యేక ఎంట్రెన్స్, ఎగ్జిట్

కౌంటింగ్ ఏర్పాట్లపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్.

**విజేత ఖమ్మం :** నిబంధనల ప్రకారం మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ పై గురువారం సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ**

5 మున్సిపాలిటీల ఎన్నికల కౌంటింగ్ కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలలో మెష్ ఏర్పాట్లతో, కౌంటింగ్ విధుల అధికారులకు, కౌంటింగ్ ఏజెంట్లకు ప్రత్యేక ఎంట్రెన్స్, ఎగ్జిట్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పటిష్ట పోలీస్ బందోబస్తుతో, అన్ని కౌంటింగ్ కేంద్రాలలో 100 శాతం వెబ్ క్యాస్టింగ్ చేస్తున్నట్లు, ప్రతి కౌంటింగ్ కేంద్రంలో రూట్ మ్యాప్ బోర్డులు ఏర్పాట్లు చేసినట్లు అన్నారు. కౌంటింగ్ హాల్స్ లో కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుందని, వీరందరికి సంబంధిత పాసులు జారీ చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలలో ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ తో కౌంటింగ్ ప్రారంభ మవుతుందని కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియలో పూర్తి నిబంధనలు పాటించాలని అన్నారు. కౌంటింగ్ తర్వాత రిజెక్ట్ ఐనా బ్యాలెట్ పత్రాలతో సహా మొత్తం ఎన్నికల సామాగ్రి సీజ్ చేసి స్ట్రాంగ్ రూమ్ కు తరలించాలని కలెక్టర్ తెలిపారు. ఏదులా పురం లోని 31 వార్డులు, మధిరలోని 22 వార్డులకు, సత్తుపల్లి లోని 23 వార్డులకు, వైరా, కల్లూరు లోని 20 వార్డులకు రెండు రౌండ్ లలో కౌంటింగ్ పూర్తయ్యేలా టేబుల్స్ వేసి కౌంటింగ్ చేయడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. ఎన్నికల కౌంటింగ్ సంబంధించి బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్స్ తరలించే ప్రక్రియ గురించి ముందుగానే రాజకీయ పార్టీలకు సమాచారం అందించి, మొత్తం ప్రక్రియ వీడియోగ్రఫీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ విధుల అధికారులు విధుల్లో ఏ దశలోనూ నిర్లక్ష్యానికి తావివ్వవద్దని, అప్రమత్తంగా ఉంటూ, తమ విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ అన్నారు. మునిసిపల్ కమిషనర్లు అప్రమత్తంగా ఉంటూ, ప్రక్రియను పర్యవేక్షణ చేయాలని, అధికారులు, కౌంటింగ్ సిబ్బందిని గైడ్ చేస్తూ, ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లుదా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, మునిసిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ సెకండ్ ఎడిషన్




ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు










**విజేత, గణపురం :** గణపురం మండలం సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో క్రీడా రంగానికి పెద్ద పీట వేస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండలం చెల్పూరు ప్రభుత్వ పాఠశాల మైదానంలో ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడా రంగానికి ప్రజాపాలన ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లోని నైపుణ్యం కలిగిన క్రీడాకారులనుప్రోత్సహించేందుకు సీఎం కప్ పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తుందని అన్నారు. విద్యార్థులు, క్రీడాకారులు ఈ పోటీల్లో తమ ప్రతిభలను కనపరిచి రాణిస్తే జాతీయ,రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపుతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి ముందుకువెళ్ళాలన్నారు. సీఎం కప్ 2026 లో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మండలాలకు చెందిన క్రీడాకారులు కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్, క్రీడలలో పాల్గొన్నారు. ఈ క్రీడలు డివైఎస్ఓ చిర్ర రఘు ఆధ్వర్యంలో నిర్వహించారు.క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులకు భోజన సౌకర్యం కల్పించడం జరిగిందని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి తెలిపారు.

# రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో రోడ్డు సమస్య తీవ్రం











### 6,240 కుటుంబాల ఆవేదన...

### ఆఫీసుల చుట్టూ ఎన్ని ఫిర్యాదులు చేసినా శూన్యం..

**విజేత,మేడ్చల్ మల్కాజ్గిరి ప్రతినిధి :** మెడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని రాంపల్లి కెసిఆర్ డబుల్ బెడ్‌రూమ్ హౌసింగ్ కాలనీలో నివసిస్తున్న 6,240 కుటుంబాలు రోడ్డు కనెక్టివిటీ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆర్ ఆర్ ఆర్ టి ఆర్ వి సోషల్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ స్థాపించిన నాటి నుండి సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో దాదాపు 24,000 మంది ప్రజలు ప్రతిరోజూ ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోందని వారు తెలిపారు.గత రెండు సంవత్సరాలుగా మెద్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం మరియు కమిషనర్ కార్యాలయాలకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదని ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ముఖ్యంగా హెచ్ పి కంపెనీ నుండి గోయిల్ కంపెనీ వరకు ఉన్న సుమారు 800 మీటర్ల రోడ్డు పూర్తిగా అభివృద్ధి చెందకపోవడం వల్ల కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇటీవల ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి టి ఎస్ ఐ ఐ సి కార్యాలయం రూ.70 లక్షల టెండర్ ప్రకటనను పత్రికల్లో విడుదల చేసినప్పటికీ, ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై కాలనీ వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.రోడ్డు లేకపోవడం వల్ల వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, ఆటో డ్రైవర్లు, బైక్ మరియు బస్సు ప్రయాణికులు, పాఠశాల విద్యార్థులు ప్రతిరోజూ ప్రమాదాలకు గురవుతున్నారని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. అత్యవసర సేవలు అందుకోవడంలో కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని వారు అన్నారు.కాబట్టి రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీ ప్రజల ప్రాణాలు మరియు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆర్ ఆర్ ఆర్ టి ఆర్ వి సోషల్ వెల్ఫేర్ ఫౌండేషన్ ప్రభుత్వాన్ని మరియు సంబంధిత అధికారులను కోరింది. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టే ఆలోచనలో ఉన్నట్లు సంకేతాలు ఇచ్చింది.

# లేబర్ కోడ్ ల ను రద్దు చేయాలి ఉపాధి హామీ చట్టాన్ని పునర్దించాలి

### మోడీ సర్కార్ దిగి వచ్చేంతవరకు ఐక్య పోరాటాలను కొనసాగిస్తాం.

### కార్మికుల పోరాటానికి ప్రభుత్వాలు దిగిరాక తప్పదు.







**విజేత,పినపాక :** నలభై నాలుగు కార్మిక చట్టాలను తొలగించి నాలుగు లేబర్ కోడ్ ల తో కార్మికులకు మరణ శాసనాన్ని రాయాలని చూస్తున్న మోడీ నీ గద్దె దించే వరకు కార్మిక కర్షక ఐక్య పోరాటాలు ఆగవని మోడీ నిరంకుశ విధానాలపై కార్మికులకు ఉన్న వ్యతిరేకత దేశవ్యాప్త సమ్మెతో మరోసారి ప్రపంచానికి తెలిసిందని సిఐటియు మండల కన్వీనర్ కొమరం కాంతారావు స్పష్టం చేశారు. దేశవ్యాప్త కార్మిక సార్వత్రిక సమ్మె కరకగూడెం మండలం లో విజయవంతమైంది సమ్మెతో అన్ని స్కీం వర్కర్ లైన ఆశ అంగన్వాడి మధ్యాహ్న భోజన ప్రభుత్వ శానిటేషన్ గ్రామపంచాయతీ కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో కార్మిక ప్రదర్శన నిర్వహించి సమ్మెను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారం చేపట్టిన నాటినుండి ఒక్కొక్కటిగా కార్మిక హక్కులను కాలరాస్తూ చివరి అస్త్రంగా కార్మిక చట్టాలను సైతం రద్దు చేశారని అన్నారు. కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్లను ఈ సంవత్సరం ఏప్రిల్ నుండి అమల్లోకి తీసుకురావాలని ఇప్పటికే రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 8 గంటల పని విధానాన్ని రద్దుచేస్తూ 12 గంటల పని విధానాన్ని తీసుకురావటమే కాకుండా కార్మికులను విభజించి పాలించే విధంగా యూనియన్లు పెట్టే అవకాశాన్ని కూడా లేకుండా మోదీ సర్కార్ నిరంకుశంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రతివేసిన కార్మిక చట్టాలను పునర్దించాలని వారు డిమాండ్ చేశారు. మోడీ సర్కార్ దిగివచ్చేంత వరకు సిఐటియు ఆధ్వర్యంలో దశల వారి ఉద్యమాలను కొనసాగిస్తామని ఈ సమ్మెతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కళ్ళు తెరవకపోతే కార్మిక ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అనంతరం తాసిల్దార్ వట్టం కాంతారావు కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారుఈ కార్యక్రమంలో అంగన్వాడి రంగం నాయకులు భవాని, స్వరూప, సుజాత, శిరీష, మంగతాయారు గ్రామపంచాయతీ రంగం కార్మికులు గుమ్మడవెల్లి కృష్ణ ధనుంజయ్ చర్ప సాంబశివరావు, రమాదేవి ,సావిత్రి , మంగమ్మ తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఉద్యోగులా?పార్టీ ఏజెంట్లా? ఆడియో సాక్ష్యంతో కలెక్టరేట్ మెట్లెక్కిన బిజెపి నేతలు





### "బంగారు పళ్ళెంలో గెలుపునిస్తాం.పోలింగ్ మేనేజ్మెంట్ మాదే!".లీకైన ఆడియోలో ఉద్యోగ సంఘాల నేతల బేరసారాలు!

### రాజ్యాంగం సాక్షిగా.. రహస్య మంతనాలు! మంత్రి పొంగులేటితో ఉద్యోగుల 'పొలిటికల్' కాన్ఫరెన్స్ పై కలెక్టర్ కు ఫిర్యాదు.

### వార్డుల వారీగా ఉద్యోగుల చిట్టావిప్పిననేతలు.ప్రజాస్వామ్యానికి పాతర వేస్తున్న వైనంపై భగ్గుమన్న బీజేపీ.

### "మీరు మా వెనుక ఉంటే చాలు.. 100% పోలింగ్ వేయిస్తాం" ఎన్నికల కోడ్ కు తూట్లు పొడిచిన ఉద్యోగులు.

**విజేత ఖమ్మం :** అధికార కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ప్రభుత్వ ఉద్యోగులు ఏకంగా ఎన్నికల క్షేత్రంలోకి దిగి పావులు కదుపుతున్నారన్న ఆరోపణలకు బలం చేకూర్చేలా బయటకు వచ్చిన ఆడియో సంభాషణ జిల్లాలో పెను దుమారం రేపుతోంది. సాక్షాత్తు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , టీఎన్జీవో , టీజీవోస్ ఉద్యోగ సంఘాల ముఖ్య నాయకులతో జరిపిన రహస్య టెలికాన్ఫరెన్స్ వ్యవహారంపై భారతీయ జనతా పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం నాడు బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు నేతృత్వంలో పార్టీ బృందం జిల్లా కలెక్టర్ ను కలిసి, ఆడియో సాక్ష్యాలతో సహా ఫిర్యాదు చేసింది. కైన ఈ ఆడియో క్లిప్ లలో ఉద్యోగ సంఘాల నేతల గొంతులో ప్రభుత్వ ఉద్యోగికి ఉండాల్సిన తటస్థ వైఖరి కన్నా, ఒక రాజకీయ కార్యకర్తకు ఉండే ఆవేశం స్పష్టంగా వినిపిస్తోందని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఒక ఉద్యోగ సంఘ నేత మంత్రితో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బంగారు పళ్ళెంలో పెట్టి గెలిపిస్తామని, మంత్రి ఇచ్చిన హామీని తాము మర్చిపోలేదని వ్యాఖ్యానించడం గమనార్హం. ఇది కేవలం మద్దతు తెలపడం మాత్రమే కాదని, స్పష్టమైన రాజకీయ ఒప్పందం లాగా ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా మరొక నేత ఏకంగా వార్డుల వారీగా ఉద్యోగుల గణాంకాలను చదివి వినిపించడం విస్మయానికి గురిచేస్తోంది. రెండవ వార్డులో 252 మంది, ఆరవ వార్డులో 402 మంది అంటూ క్షుణ్ణంగా లెక్కలు చెబుతూ, ప్రభుత్వ రికార్డుల్లో ఉండాల్సిన ఉద్యోగుల వ్యక్తిగత డేటాను రాజకీయ ప్రయోజనాల కోసం వాడటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మాదిరిగానే ఇప్పుడు కూడా పోలింగ్ బూత్ లకు అందరినీ తరలించి పోలింగ్ మేనేజ్మెంట్ బాధ్యతను తామే భుజాన వేసుకుంటామని ఉద్యోగ సంఘాల నేతలు మంత్రికి హామీ ఇవ్వడం ఆడియోలో స్పష్టంగా రికార్డ్ అయ్యింది. ఎన్నికల విధుల్లో నిష్పక్షపాతంగా ఉండాల్సిన ఉద్యోగులే ఇలా మాట్లాడటం ఎన్నికల కమిషన్ నిబంధనలను నేరుగా ఉల్లంఘించడమేనని బీజేపీ నేతలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ప్రతిస్పందనగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉద్యోగులను వారించకపోగా, బాధ్యత తీసుకుని గెలిపించుకురండని, రేపు పొద్దున ఏ అవసరం వచ్చినా అన్నగా తానుంటానని వారికి అభయహస్తం ఇవ్వడం ప్రలోభపెట్టే చర్య కిందకే వస్తుందని బీజేపీ మండిపడింది. కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడిన రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావులు , రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు ఇలా దిగజారి వ్యవహరించడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఆడియోలో



మాట్లాడిన జయపాల్, వేలాద్రి, శోభన్ బాబు తదితర ఉద్యోగ సంఘ నేతలను తక్షణమే సర్వీస్ నుండి సస్పెండ్ చేయాలని, మంత్రి పొంగులేటిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నమ్ముకోవడం మానేసి ఉద్యోగుల ఓట్లను దొంగిలించి గెలవాలని చూస్తోందని ఎద్దేవా చేశారు. ఒకపక్క ఫోన్ ట్యాపింగ్ లపై గగ్గోలు పెట్టే మంత్రులే ఇప్పుడు ఇలాంటి రహస్య మంతనాలు జరపడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని, జిల్లా యంత్రాంగం స్పందించకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఈ కార్యక్రమంలో నాయకులు దొంగల సత్యనారాయణ, నున్నా రవి, గుత్తా వెంకటేశ్వరరావు, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, వీరెల్లి రాజేష్, రవి రాథోడ్, అల్లిక అంజయ్య, దొడ్డ అరుణ, రవి గౌడ్, కొణతం లక్ష్మీనారాయణ, బోయినపల్లి సురేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అక్షర విజేత క్యాలెండర్ ఆవిష్కరించిన మండల ఆపద్బాంధవుడు.!

### తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా!!



**విజేత,శివంపేట :** శివంపేట మండల కేంద్రంలో అక్షర విజేత తెలుగు జాతీయ దినపత్రిక శివంపేట మండల ఆపద్బాంధవుడు, సంఘ సేవకులు తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా శివంపేట గ్రామసర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్ మరియు పబ్బ మహేష్ గుప్తా యువసేన సభ్యులు గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యుల సమక్షంలో అక్షర విజేత తెలుగు జాతీయ దినపత్రిక కేలండర్ ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా సమాజంలో పత్రికల పాత్ర చాలా కీలకమైనది అని సమాజానికి ప్రభుత్వానికి ప్రజల మధ్య ఆరధిగా పత్రికలు ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని గుర్తు చేశారు. పత్రికలకు స్వేచ్ఛ చాలా ముఖ్యమని వివిధ పత్రికల్లో పని చేసే పాత్రికేయులు సమాజానికి అర్థం పడతాయని అక్షర విజేత నిష్పక్షపాత వార్తలతో ప్రజలకు చేరుకోవడం సంతోషకరము అని అన్నారు. నూతన సంవత్సరంలో అక్షర విజేత మరెన్నో విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాజిపేట వెంకటేశ్వర్, నూతన వార్డు సభ్యులు ఎస్ నరేష్, గ్రామ బి ఆర్ఎస్ అధ్యక్షులు ముదగల లక్ష్మీ నరసయ్య, తాజా మాజీ వార్డు సభ్యులు వంజరి కొండల్, బిజిలిపురం కృష్ణ, పబ్బ మహేష్ గుప్తా యువసేన సభ్యులు ముద్దగల రాజు, లస్కరి స్వామి, డ్రైవర్ సాయి, కొత్తపేట శ్రీనివాస్ గౌడ్, లంబడి రవి, తదితరులు అక్షర విజేత క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా 163 సెక్షన్

### శాంతి భద్రతల కోసం ఆదేశాలు జారీచేసిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ జి.సుధీర్ బాబు.



**విజేత, ఇబ్రహీంపట్నం :-** తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతి భద్రతలు కాపాడుటకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు ఐపీఎస్ భారతీయ నాగరిక సురక్షా సంహిత (బిఎంఎస్ఎస్) సెక్షన్ 163 ప్రకారం నిషేధాజ్ఞలు జారీ చేశారు. నేడు ఉదయం 6:00 గంటల నుండి రాత్రి 11:00 గంటల వరకు సంబంధిత కౌంటింగ్ కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో 5 మందికి మించిన గుంపులు కూడకుండా నిషేధం అమలులో ఉంటుంది. ఈ ఆదేశాలు ఆమనగల్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, శంకర్‌పల్లి, మొయినాబాద్, చేవెళ్ల ప్రాంతాలలో అమలులో ఉంటాయి. ప్రజలు పోలీసులకు సహకరించి శాంతి భద్రతలు కాపాడాలని విజ్ఞప్తి చేయబడింది. ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.

# కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కూడా రద్దు చేయాలి



**విజేత దేవరకద్ర :** కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోళ్లను రద్దు చేయాలని రైతు సంఘం అధ్యక్షుడు రామచంద్ర కోరారు. గురువారం మండల కేంద్రంలోని కార్మిక రైతు సంఘంతో ఏర్పాటు చేసిన సమయంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడలు రద్దు చేయాలని డిమాండ్ చేసి ఆయన కోరారు. 2025 లో తెచ్చిన ఉప్పరి ఆమె పథకం పనులను అదేవిధంగా కొనసాగించాలి. ఉపాధి హామీ కార్మికులకు, ప్రతి ఒక్కరు కూడా ప్రభుత్వం అందించే అన్ని పథకాలను పార్టీ చేయాలా చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తాసిల్దార్ కు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో మెగా క్యాంప్ ఏర్పాటు




**విజేత, పినపాక :** మండల పరిధిలోని ప్రజలకు ఉపయోగపడే విధంగా రేపు అనగా శుక్రవారం పినపాక మండలం ఈ బయ్యారం పోస్ట్ ఆఫీస్ ఆధ్వర్యంలో మెగా క్యాంపును నిర్వహించనున్నట్లు పోస్టల్ అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం ఈ బయ్యారం పంచాయతీ కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వ పథకాలు మరియు పోస్టల్ సేవలపై అవగాహన కల్పిస్తూ, వివిధ సేవలను ఒకే వేదికపై అందించనున్నారు.ఈ మెగా క్యాంపులో ఆధార్ అప్డేట్, కొత్త ఖాతాల ప్రారంభం, సుకన్య సమృద్ధి యోజన, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, ఆర్డీ , ఎంఐఎస్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయి. అలాగే సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక సహాయం కల్పించనున్నట్లు తెలిపారు.పోస్టల్ శాఖ అధికారులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలు బ్యాంకింగ్ మరియు పొదుపు పథకాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు అవసరమైన ఆధార్ కార్డు, పాస్‌బుక్, ఫోటోలు తదితర పత్రాలు వెంట తీసుకురావాలని కోరారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకుని, తమ అవసరాలకు సంబంధించిన సేవలను పొందాలని విజ్ఞప్తి చేశారు.

# గంజాయి రవాణా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్: 26 గ్రాముల గంజాయి స్వాధీనం




**విజేత, సిద్దిపేట ప్రతినిధి:** సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలో గంజాయి వినియోగాన్ని మరియు రవాణాను పూర్తిగా అరికట్టే చర్యల్లో భాగంగా సిద్దిపేట టూ టౌన్ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. టూ టౌన్ పోలీసులు కెసిఆర్ నగర్ మరియు పరిసర ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, గుండ్ల చెరువు సమీపంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, వారి వద్ద గంజాయి లభ్యమైంది.

**నిందితుల వివరాలు:**

కోదూరు సురేష్ నివాసం భరత్ నగర్, సిద్దిపేట, ఆగుళ్ళ ఎల్లేష్ నివాసంసిద్దిపేట. నిందితుల వద్ద 26 గ్రాముల గంజాయి, 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేయడం జరిగింది. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ తెలిపారు. గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయానికి పాల్పడినా లేదా సేవించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, యువత ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును పాడు చేసుకోవద్దని ఈ సందర్భంగా సిద్దిపేట టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ హెచ్చరించారు.

# ఓట్ల కౌంటింగ్ కు ఏర్పాట్లు పూర్తి - మాను చౌదరి

14 టేబుల్ లతో ఓట్ల లెక్కింపు 153 మంది సిబ్బందితో ఉదయం 8 గంటలకు ప్రారంభం..





**విజేత, మేడ్చల్ మల్కాజ్గిరి ప్రతినిధి :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పరిధిలోని ఇటీవల జరిగిన ఎలక్షన్ సంబంధించిన మున్సిపాలిటిలు, మున్సిపల్ కార్పొరేషన్ ల సాధారణ ఎన్నికల 2026లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీ లలో ఓట్ల లెక్కింపు కోసం అలియాబాద్ మున్సిపాలిటీకి సంబంధించిన మజీద్పూర్ లోని శ్రీ టి చైతన్య హై స్కూల్ లో, మూడు చింతలపల్లి మున్సిపాలిటీకి సంబంధించిన జగ్గం గూడాలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ లో, ఎల్లంపేట్ మున్సిపాలిటికి సంబంధించి బైబిల్ కాలేజీ లలో 14 టేబుళ్లతో ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. ఒక్కొక్క టేబుల్ కు ఒక సూపర్ వైజర్, ఇద్దరు అసిస్టెంట్లతో కలిపి మొత్తం 153 సిబ్బందితో ఉదయం 8 గంటల నుండి మొదలు పెట్టి ఓట్ల లెక్కింపు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. లెక్కింపు ప్రక్రియ మొత్తం సిసి కెమెరాల పర్యవేక్షణలో గట్టి బందోబస్తు మధ్య నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజల ప్రశాంతతకు ఎటువంటి భంగం వాటిల్లకుండా, ముందస్తు భద్రతలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండడానికి లెక్కింపు కేంద్రాల పరిసర ప్రాంతాలలో 500రేడియస్ లోపల ఐదుగురికి మించి గుమిగూడరాదని, నిబంధనలు అతిక్రమించినట్లయితే చట్టరీత్య చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు.

# 2 వ డివిజన్ టిడిపి పార్టీ స్థలం ఆక్రమణ కువ్యతిరేకం గా పెద్ద ఎత్తున గుమ్మిగూడిన టిడిపి శ్రేణులు





**విజేత ఖమ్మం:** ఖమ్మం నగరం లోని 2వ డివిజన్ (పాండురంగ పురం) వద్ద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1999 సంవత్సరంలో తెలుగుదేశంపార్టీ ప్రభుత్వం హయాంలో 150 ఎకరాలకు ఇండ్లు లేనివారికి ఇండ్ల స్థలాలు ఇవ్వడం జరిగింది, అదే క్రమం లో పార్టీ కార్యాలయానికి 85 గజాల స్థలం అప్పటి ఖమ్మం ఎం ఆర్ ఓ కేటాయించారు, జిల్లా నాయకులు స్థానిక నాయకులు ఆ స్థలం లో టీడీపీ దిమ్మె కట్టించి జెండా ఎగరవేశారు, అప్పటి నుంచి పార్టీ అధీనంలో ఉన్న స్థలం కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు దొంగ పట్టా సృష్టించి పార్టీ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేయాలని ప్రయత్నించగా స్థానికులు వారితో వాగ్వాదానికి దిగి టిడిపి పార్టీ కార్యాలయానికి తెలియజేశారు, విషయం తెలుసుకున్న వెంటనే జిల్లా నాయకులు కేతినేని హరీష్ చంద్ర, గుత్తా సీతయ్య, వాసిరెడ్డి భాస్కరరావు, వనమా వాసు, వడ్డేం విజయ్, హుటా హుటిన కబ్జా కాబడిన స్థలం వద్దకు చేరుకొని నిరసన తెలియజేసి జెసిబి ద్వారా స్థలాన్ని శుభ్రపరిచి పార్టీ జెండా పాతి స్థలం స్వాధీనపరచుకోవడం జరిగింది, ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ అధ్యక్ష కార్యదర్శి కృష్ణమాచారి, యల్లంకి నరసింహారావు, పోట్ల నాగేశ్వరావు, మందడపు సుధాకర్, మహిళ నాయకురాలు వేగినాటి ఉమ, తాడిశెట్టి స్వాతి, అనితా,మంగమ్మ, పావని,లావణ్య, ఝాన్సీ, నాయకులు చంద్ర రవి, పెనుగొండ ఉపేందర్, గుండెపిన్నీ నాగేశ్వరరావు, కన్నెటి పృధ్వీ, నాగండ్ల లక్ష్మణ్, కొలికొండ మురళి, చింతనిప్పు నాగేశ్వరరావు, గుడిపూడి నాగేశ్వరరావు, ఎర్నం జేమ్స్, చావా నరేందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# అక్షర విజేత క్యాలెండర్ ఆవిష్కరించిన

తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా!!



**విజేత,శివంపేట :** శివంపేట మండల కేంద్రంలో అక్షర విజేత తెలుగు జాతీయ దినపత్రిక శివంపేట మండల ఆపద్బాంధవుడు, సంఘ సేవకులు తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా శివంపేట గ్రామసర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్ మరియు పబ్బ మహేష్ గుప్తా యువసేన సభ్యులు గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యుల సమక్షంలో అక్షర విజేత తెలుగు జాతీయ దినపత్రిక కేలండర్ ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా సమాజంలో పత్రికల పాత్ర చాలా కీలకమైనది అని సమాజానికి ప్రభుత్వానికి ప్రజల మధ్య అరధిగా పత్రికలు ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని గుర్తు చేశారు. పత్రికలకు స్వేచ్ఛ చాలా ముఖ్యమని వివిధ పత్రికల్లో పని చేసే పాత్రికేయులు సమాజానికి అర్థం పడతాయని అక్షర విజేత నిష్పక్షపాత వార్తలతో ప్రజలకు చేరుకోవడం సంతోషకరము అని అన్నారు. నూతన సంవత్సరంలో అక్షర విజేత మరెన్నో విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాజిపేట వెంకటేశ్వర్, నూతన వార్డు సభ్యులు ఎస్ నరేష్, గ్రామ బి ఆర్ఎస్ అధ్యక్షులు ముదగల లక్ష్మీ నరసయ్య, తాజా మాజీ వార్డు సభ్యులు వంజరి కొండల్, బిజిలిపురం కృష్ణ, పబ్బ మహేష్ గుప్తా యువసేన సభ్యులు ముద్దగల రాజు, లస్కరి స్వామి, డ్రైవర్ సాయి, కొత్తపేట శ్రీనివాస్ గౌడ్, లంబడి రవి, తదితరులు అక్షర విజేత క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జాతీయ రోడ్డు భద్రతా అవగాహన మాసం 2026 ముగింపు కార్యక్రమం విజయవంతం




**విజేత, హైదరాబాద్ బ్యూరో :** జాతీయ రోడ్డు భద్రతా అవగాహన మాసం--2026 సందర్భంగా మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీసీపీ కె. రాహుల్ రెడ్డి, ట్రాఫిక్అదనపు డీసీపీ ఎ. లక్ష్మి పర్యవేక్షణలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ క్రమశిక్షణ మరియు సురక్షిత రోడ్డు ప్రవర్తనపై అవగాహన కల్పించే ముగింపు కార్యక్రమం హైదరాబాద్ బేగంపేట ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో నిర్వహించారు. మల్కాజ్‌గిరి ట్రాఫిక్ తిరుమలగిరి డివిజన్ ఏసిపి జి. శంకర్ రాజు నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బేగంపేట ఎయిర్ ఫోర్స్ స్టేషన్ సీఈఓ గ్రూప్ కెప్టెన్ ఎ. ప్రవీణ కుమార్, ఎస్‌టిఓ (ఎంటి) వింగ్ కమాండర్ ఎస్. జి. మాగోత్రా, వారెంట్ ఆఫీసర్ సంజీవ్ తివారీ, ట్రాఫిక్ పి.ఎస్. బేగంపేట ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. జానకి రాములు, హీరో మోటోకార్ప్ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ మేనేజర్ సాదిక్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛందంగా సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులకు జేజేలు

ఎస్ డబ్ల్యూ ఎఫ్ రీజియన్ అధ్యక్ష,కార్యదర్శులు గుండు మాధవరావు,పిట్టల సుధాకర్.



**విజేత ఖమ్మం :** భారత రాజ్యాంగం కల్పించిన కార్మిక హక్కులు నిలబెట్టుకునేందుకు,కార్మికులకు ఉరితాళ్లుగా మారనున్న లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు సమ్మెలో పాల్గొని జయప్రదం చేసిన ఆర్టీసీ ఖమ్మం రీజియన్ కార్మికులందరికీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(సిఐటియూ) ఖమ్మం రీజియన్ అధ్యక్ష కార్యదర్శులు గుండు మాధవరావు,పిట్టల సుధాకర్ లుఅభినందనలు,జేజేలు తెలియజేశారు. గురువారం దేశవ్యాప్తంగా జరిగిన సార్వత్రిక సమ్మెలో ఖమ్మం రీజియన్ లోని ఆర్టీసీ ఏడు డిపోలలో స్టాఫ్ అండ్ వర్కర్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్ టియుసి అనుబంధం)ఎంప్లాయీస్ యూనియన్ ల ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారు.సమ్మె సందర్భంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల సుధాకర్,ఆర్టీసీ ఐఎన్ టీయుసీ రాష్ట్ర కార్యదర్శి బత్తినేని హనుమంతరావు లు మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాటాలు,త్యాగాలు చేసి అనేక కష్టనష్టాలు తో సాధించుకున్న హక్కులు,సౌకర్యాలను కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్ లుగా రూపొందించి పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చిందని, కార్మికుల శ్రమను దోచుకునేందుకు విధానాలు రూపొందించారని ఆవేదన వ్యక్తం చేశారు.సామాజిక భద్రత,ఉద్యోగ భద్రత,కనీస వేతనాలు,హక్కులు,సౌకర్యాలు లేని ఉద్యోగాల కల్పన చేస్తున్నారన్నారు.శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగ నియమాకాలు చేపట్టాల్సి ఉండగా కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్,పిక్సుడ్ టర్మ్ ఉద్యోగ నియామకాలు చేస్తూ కార్మికుల శ్రమశక్తిని పెట్టుబడిదారులకు కారు చౌకగా అందించే కుట్రలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఆర్టీసీలో ఎలక్ట్రికల్ బస్సులో విధానంతో పెట్టుబడిదారులకు అవకాశం కల్పిస్తున్నారన్నారు. వెంటనే విద్యుత్తు బస్సుల విధానంలో మార్పులు చేయాలని ఆర్టీసీలకే విద్యుత్ బస్సుల నిర్వహణను అప్పగించాలన్నారు.మోటార్ వెహికల్ యాక్ట్ 2019 లో అవసరమైన సవరణలు చేయాలన్నారు.భారత కార్మిక వర్గానికి నష్టదయకమై లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ అధ్యక్షులు గుండు మాధవరావు,కోశాధికారి పగిళ్లపల్లి నరసింహారావు సహాయ కార్యదర్శి వి.రమేష్ ఖమ్మం డిపో కార్యదర్శి గుగ్గిల్ల రోశయ్య,ఆర్టీసీ ఐఎన్ టియుసి నాయకులు అంజయ్యఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వై. భుజంగర్ ఎస్ డబ్ల్యూ ఎఫ్ డిపో సహాయ కార్యదర్శి గుర్రం రామారావు,మహిళా కన్వీనర్ సరిత నాయకులు అయోధ్య,బాబు,బిఎల్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పేదల చాటున పెద్దలను కాపాడుతున్నా కాప్ర టౌన్ ప్లానింగ్ యంత్రాంగం..

నాలా ప్రక్కన షెడ్డు,భారీ కమర్షియల్, రేకుల షెట్టర్లపై నోరు మెదపని టౌన్ ప్లానింగ్..

నమామత్రంగా కొన్ని పెదా, మధ్య తరగతి ఇండ్లను సీజ్ చేస్తున్నా టౌన్ ప్లానింగ్..

మా పని మేము చేస్తున్నాము, అలస్యం పై అధికారుల బాధ్యతే.చైన్మెన్లు..



**విజేత, మేడ్చల్ మల్కాజ్గిరి ప్రతినిధి :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాప్ర సర్కిల్ లో టౌన్ ప్లానింగ్ అధికారులు పేదల చాటున పెద్దలను కాపాడే ప్రయత్నం., కాప్ర టౌన్ ప్లానింగ్ అధికారులు చేస్తున్నారు అని కాప్ర సర్కిల్లోని ప్రజలు వాపోతున్నారు. నాలా ప్రక్కన షెడ్డు నిర్మాణాన్ని, భారీ ఎత్తున కమర్షియల్ నిర్మాణం మరియు రేకుల భారీ షటర్ల నిర్మాణం చేస్తున్న ఈ అనుమతులు లేని నిర్మాణాలపై ప్రభుత్వపరమైన చర్యలు తీసుకోకుండా., కొంతమంది పేద మధ్యతరగతి ఇండ్లను కాప్ర టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేస్తూ పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారు. ఇలాంటి నిబంధనలు లేని నిర్మాణాలపై పత్రికలలో వచ్చిన వార్తలను టౌన్ ప్లానింగ్ అధికారులు పెడచెవున పెడుతున్నారు. అలాంటి,కాప్ర టౌన్ ప్లానింగ్ అధికారులు మధ్య తరగతి ఇండ్లను మాత్రం ఎందుకు సీజ్ చేస్తున్నారు అని కాప్ర ప్రజలు విస్మయానికి గురవుతున్నారు. నిబంధనలు లేని నిర్మాణాలపై ఆ ఏరియా చైన్ మేన్ లకు సమాచారం ఇచ్చిన పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. చైన్ మేన్ లను ఇందుకు సంబంధించి సమాధానం అడిగినప్పుడు... ఇందులో మా ప్రయత్నం మేము చేసాము.ఇకపై పూర్తి అధికారం పైఅధికారి చేతిలో ఉన్నాయి ,అందువల్లనే ఆలస్యం అవుతుంది అని చైన్ మెన్లు సమాధానం ఇస్తున్నారు. ఇంతకుముందు భారీ ఎత్తున కొన్ని నిబంధనలు లేని నిర్మాణాలని సీజ్ చేశారు. మరి నాలా ప్రక్కన షెడ్డు, అనుమతులు లేని భారీ కమర్షియల్, మరియు భారీ రేకుల షటర్ల నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కాప్ర మున్సిపల్ ప్రజలు అధికారులపై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఇకనైనా కాప్ర టౌన్ ప్లానింగ్ అధికారులు పైనా పేర్కొన్నా నిర్మాణాలపై ఇంతకు ముందు కొన్ని సీజ్ చేసినా తరహా లో విచారణ చేపట్టి చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# "లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే! కేంద్రం మొండివైఖరిపై విరుచుకుపడ్డ కార్మిక సంఘాలు."

ములకలపల్లి లో కార్మిక వర్గం పెద్ద ఎత్తున ఎర్ర దండు భారీ ర్యాలీ ప్రదర్శన

మోడీ ప్రభుత్వం తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే ఉపసర్మించుకోవాలి.

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలి.

కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి.





**విజేత, ములకలపల్లి :** బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక విధానాలను ఖండించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్,గోకినపల్లి ప్రభాకర్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మె సందర్భంగా మండల కేంద్రము లోని సిఐటియు, ఏఐటీయూసీ,టియుసిఐ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భారీ ర్యాలీ,ప్రదర్శన నిర్వహించారు. సమ్మె కు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం ఇంచార్జీ తాహశీల్దార్ భాగ్యలక్ష్మి కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అన్నవరపు సత్యనారాయణ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు కార్మికులకు ఉరి తాళ్ళు గా మారాయని భారతదేశ ఆర్థిక వ్యవస్థ లో కార్మికులు మూల స్తంభం లాంటి వారని కార్మికులు ఏళ్ళుగా పోరాడి తీసుకొచ్చిన 29 కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కి కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ చట్టాలను తీసుకువస్తుతుందని అన్నారు. నాలుగు లేబర్ కోడ్ ల కారణంగా కార్మికులు శ్రమ ఒత్తిడి గురై భవిష్యత్తులో అనేక అనారోగ్యా సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని అన్నారు. దేశ రైతాంగానికి మరణ శాసనం లా ఉన్న నూతన విద్యుత్ చట్టాన్ని వెంటనే ఉపసర్వించుకోవాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్ల ను ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తించి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు సౌలభ్యం కల్పించడమే లక్ష్యంగా నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాస్తుందని అన్నారు. వేతన కోడ్, పరిశ్రమ సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్,ఉద్యోగ భద్రత కోడ్, ఈ చట్టాలు కార్మికుల శ్రమను యాజమాన్యాలకు దోచిపెట్టామేనని ఈ సారాంశమని అన్నారు. నాలుగు లేబర్ చట్టాలను బిజెపి ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు పోరాడాతామని హెచ్చరించారు. మోడీ సర్కార్ కు కార్మికులు,రైతు, వ్యవసాయ కార్మికు పట్ల చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కార్మికులకు పని భద్రత కల్పించి కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ. జీ రామ్ జీ చట్టం తీసుకువచ్చి ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి ఉపాధి హామీ కార్మికులు పని కోల్పోయే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఉపాధి హామీ కార్మికులకు రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నూతన విత్తన చట్టాన్ని వెంటనే ఉపసర్వించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను బ్యాంకులు, ఎల్ఐసి ఇతర రంగాల ను కార్పొరేట్ శక్తుల చేతులలో పెడుతున్నాడన్నారని ఈ విధానాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కుంజా కృష్ణ మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐకెఎమ్ఎస్ జిల్లా కార్యదర్శి కోరం వెంకటేశ్వర్లు (గణేష్), మాట్లాడుతూ.. కార్మికులు, కర్షకుల పట్ల బిజెపి ప్రభుత్వం ద్వంద విధానాలు అవలంభిస్తుందని కార్పొరేట్ పెట్టుబడి దారుల అనుకూల విధానాలను నాలుగు లేబర్ చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోకపోతే కార్మికులు, రైతులు,రైతు కూలీలు ఐక్యంగా మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు ఉద్యామిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు దుబ్బ ధనలక్ష్మి,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు,టియుసిఐ జిల్లా నాయకులు నూప భాస్కర్, కల్లూరి కిషోర్,సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు, ఏఐటీయూసీ నాయకులు యూసుఫ్, ఎస్కే జబ్బార్, నాగరాజు,పివైఎల్ నాయకులు కోర్సా రామకృష్ణ,పద్మ,సిఐటియు నాయకులు గంటా శ్రీనివాసరావు,బుగ్గా వెంకట నర్సమ్మ, కీసరి జయ,ఓరుగంటి శ్రీను, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

# బైకు అదుపు తప్పి వ్యక్తి మృతి

బుధవారం 07:30 లకు రోడ్డు ప్రమాదం,08:00 చికిత్స పొందుతూ మృతి



**విజేత ఏదుల :** వనపర్తి జిల్లా ఏదుల మండల గొల్లపల్లి గేటు దగ్గర బుధవారం రాత్రి వెన్నెచర్ల గ్రామానికి చెందిన వొంగురి కురుమూర్తి వనపర్తి నుండి వెన్నెచర్ల కు బైక్ పై వెళుతూ మార్గ మధ్యలో గొల్లపల్లి గేట్ దగ్గర 07:30 గంటల సమయంలో బైక్ అతివేగంగా నడపడం తో అదుపు తప్పి పక్కన ఉన్న పొలంలో పడగ వెంటనే 108 లో వనపర్తి కి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ నిన్న రాత్రి 08 గంటలకు మృతి చెందినాడు అతని తల్లి వొంగురి శంకరమ్మ ఈ రోజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేవల్లి ఎస్ఐ రజిత కేసు నమోదు చేసి వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రి లో పోస్టుమార్టం చేయించి దర్యాప్తు చేయనైనది.

# కేంద్ర విధానాలపై కార్మిక గర్జన కాగజ్ నగర్లో భారీ ర్యాలీ





**అక్షర విజేత కాగజ్ నగర్ ప్రతినిధి :** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కాగజ్ నగర్లో సిఐటియు ఆధ్వర్యంలో భారీ కార్మిక ర్యాలీ జరిగింది. బాలభారతి హైస్కూల్ వద్ద ప్రారంభమైన ర్యాలీ రాజీవ్ గాంధీ చౌరస్తా, పొట్టి శ్రీరాములు విగ్రహం, అంబేద్కర్ చౌక్ మీదుగా స్టేట్ బ్యాంక్ వరకు సాగి బహిరంగ సభగా మారింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని, లేబర్ కోడ్ లు, 'హైర్ అండ్ ఫైర్' విధానాలతో కార్మికుల హక్కులు దెబ్బతింటాయని ఆరోపించారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, కార్మిక సంక్షేమంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

# కాగజ్ నగర్లో కౌంటింగ్కు సిబ్బందికి శిక్షణ



**అక్షర విజేత కాగజ్ నగర్ ప్రతినిధి :** కాగజ్ నగర్ మున్సిపాలిటీలో రేపు జరగనున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఆర్.ఓలు, కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్లకు శిక్షణ నిర్వహించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, మున్సిపల్ కమిషనర్ బి.తిరుపతి హాజరై కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఎలక్షన్ మాస్టర్ ట్రైనర్ ఎం.ఏ. ఆసిఫ్ కౌంటింగ్ విధానంపై సవివరంగా అవగాహన కల్పించారు.

# కాప్రా చెరువు అభివృద్ధి, సుందరీకరణ కోసం హైడ్రా ద్వారా రూ.35 కోట్లు మంజూరు

బండారి లక్ష్మా రెడ్డికీ కృతజ్ఞతలు తెలిపిన డివిజన్ అధ్యక్షుడు బైరి నవీన్ గౌడ్..




**విజేత, మేడ్చల్ మల్కాజ్గిరి ప్రతినిధి :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాప్రా మండలం కాప్రా ప్రజల తరపున, కాప్రా చెరువు అభివృద్ధి మరియు సుందరీకరణ కోసం హైడ్రా ద్వారా రూ.35 కోట్లు మంజూరు చేయించిన ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మా రెడ్డికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.ఈ చారిత్రాత్మక నిధుల మంజూరు పర్యావరణ పరిరక్షణ, చెరువుల పునరుద్ధరణ మరియు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి పట్ల వారి అచంచల నిబద్ధతకు నిదర్శనం. కాప్రా చెరువు కేవలం ఒక జలాశయం మాత్రమే కాదు --- మా ప్రాంత ప్రజల జీవనాధారం. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ సమతుల్యత పెంపొందడంతో పాటు భూగర్భ జలాల స్థాయి మెరుగుపడి, వేలాది మంది ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయి.మా ప్రాంతానికి ఇంతటి భారీ నిధులు తీసుకురావడంలో మీ నిరంతర కృషి, దూరదృష్టి నాయకత్వాన్ని కాప్రా ప్రజలు హృదయపూర్వకంగా అభినందిస్తున్నారు.మీ నాయకత్వంలో కాప్రాను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడంలో మా సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది.బైరి నవీన్ గౌడ్ అధ్యక్షులు, కాప్రా డివిజన్.

# మున్సిపల్ కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్



**విజేత మెదక్ జిల్లా ప్రతినిధి :** మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. తూప్రాన్, నర్సాపూర్, రామాయంపేట మున్సిపాలిటీల స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికల సంఘం నియమాలను కచ్చితంగా పాటిస్తూ కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి అయ్యిందని, రేపు ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున శాంతి భద్రతకు భంగం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టామని, కౌంటింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయా చంద్రారెడ్డి, మెదక్ డైట్ కళాశాల ప్రిన్సిపల్ రాధాకిషన్, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్‌లు పాల్గొన్నారు.



# వేస్లీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్ పరిశీలన -- అదనపు ఎస్పీ మహేందర్





**విజేత మెదక్ జిల్లా ప్రతినిధి :** మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని వేస్లీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ మరియు కౌంటింగ్ సెంటర్‌ను మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పరిశీలించారు. శుక్రవారం జరగనున్న ఓట్ల లెక్కింపును దృష్టిలో ఉంచుకుని భద్రతా ఏర్పాట్లను ప్రత్యక్షంగా సమీక్షించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడు స్థాయిల భద్రత, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ, ప్రవేశ--నిష్క్రమణ ద్వారాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తును పరిశీలించారు. అనుమతి లేని వ్యక్తులను స్ట్రాంగ్ రూమ్ వద్దకు అనుమతించవద్దని అధికారులకు ఆదేశించారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లు వాహనాలను పోలీసులు సూచించిన ప్రదేశాల్లోనే పార్క్ చేయాలని సూచించారు. కౌంటింగ్ సెంటర్‌లోకి మొబైల్ ఫోన్లు పూర్తిగా నిషేధమని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అలాగే మెదక్ జిల్లాలో పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమల్లో ఉన్నందున అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదని హెచ్చరించారు. కౌంటింగ్ టేబుళ్లు, ఏజెంట్లకు కేటాయించిన స్థానాలు, మౌలిక సదుపాయాలపై అధికారులతో చర్చించి, లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా సజావుగా సాగేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ భద్రత కొనసాగుతుందని, ప్రజలు మరియు అభ్యర్థులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ టౌన్ సీఐ మహేష్, ఆర్ఎస్ఐ మహిపాల్, ఎస్ఐ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# నూతన లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలి

## చిగురుమామిడి లో కార్మిక సంఘాల నిరసన



**విజేత:చిగురుమామిడి :** దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు నిర్వహిస్తున్న సమ్మె లో భాగంగా చిగురుమామిడి మండలం లో సి.ఐ.టీ.యూ,ఎఐటియు, బి.ఆర్.టి.యు, యూనియన్స్ జాతీయ ఫెడరేషన్ ల పిలుపు మేరకు చిగురుమామిడి మండల కేంద్రంలో అన్ని రంగాల కార్మికులు నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని నిరసన తెలియజేశారు.ఆశ, అంగన్వాడి, మధ్యాహ్నం భోజనం,హమలీ, గ్రామపంచాయతీ కార్మికులు బస్ స్టాండ్ నుంచి తహసీల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సి.ఐ.టీ.యూ జిల్లా ఉపాధ్యక్షురాలు మారెళ్ళ శ్రీలత హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని కార్మికులు 100 సంవత్సరాలు పోరాడి తీసుకొచ్చిన 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చారని అవి కార్మికులకు, రైతులకు, ప్రజలకు నష్టం కలిగించే విధంగా ఉన్నాయన్నారు కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు లేకుండా, సమ్మె చేసే హక్కు లేకుండా,పని గంటలు 8 గంటలు కాకుండా పనిగంటలు పెంచుతూ, వేతనాలు అడిగే హక్కు లేకుండా కార్మికులకు తీవ్రంగా నష్టం కలిగించే విధంగా ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్కువ వేతనాలతో ఎక్కువ పనులు చేయించుకునే విదంగా పని ప్రదేశాలలో ఎటువంటి హక్కులు అడగకుండా చేసి ప్రతి ఘటన లేకుండా చేయడం,కార్మికులకు, రైతులకు, ప్రజలకు నష్టం కలిగించే, ప్రజలకు ఉపాధి లేకుండా చేసే ఈ లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలి లేకుంటే రాబోయే రోజుల్లో కార్మికులను, రైతులను,ప్రజలను అందరినీ ఐక్యం చేసిపోరాటాలు ఉధృతం చేస్తామన్నారు నాలుగు లేబర్ కోర్స్ రద్దు చేసేంతవరకు ఊరుకునేది లేదన్నారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ లీడర్ అంగన్వాడి టీచర్స్ విజయ,తిరుమల,పద్మ, ధనలక్ష్మి,పద్మ,పావని, ఆశ మండల అధ్యక్షురాలు పద్మ, కార్యదర్శి ప్రియాంక, కల్పన,అంజలి,సునీత తదితరులు పాల్గొన్నారు

# నూతన సర్పంచ్,వార్డు సభ్యులకు గౌడ సంఘం ఘన సన్మానం

## అన్ని వర్గాలకు సమాన అభివృద్ధి --- పనితోనే నమ్మకం నిలబెడతా, సర్పంచ్ రజిత వెంకటేశం



**విజేత ఇల్లంతకుంట :** మండలంలోని అనంతారం గ్రామంలో ఇటీవల ఎన్నికైన నూతన సర్పంచ్,వార్డు సభ్యులను గౌడ సంఘం అధ్యక్షుడు వొల్లాల అంజయ్య గౌడ్ ఆధ్వర్యంలో గౌడ సంఘ సభ్యులు గురువారం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు.గ్రామ ప్రజల విశ్వాసంతో బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేశం గౌడ్,వార్డు సభ్యులు వొల్లాల లక్ష్మీ కృష్ణ కుమార్ గౌడ్,గోనపల్లి లావణ్య వెంకటేశం గౌడ్ లను శాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఇచ్చిన తీర్పు అభివృద్ధికి దారి తీస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం సర్పంచ్ రజిత వెంకటేశం మాట్లాడుతూ గ్రామంలో అన్ని కులాలు,వర్గాల ప్రజలను సమానంగా పరిగణిస్తూ ప్రతి వార్డును సమాన అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తానని తెలిపారు.తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కృషి చేస్తానని,మాటల కంటే పనితోనే సమాధానం ఇస్తానని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా తనను సన్మానించిన గౌడ సంఘ సభ్యులకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘ సభ్యులు,గ్రామ పెద్దలు,యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# మార్షల్ ఆర్ట్స్ లో బాలికలకు శిక్షణ



**విజేత ఇల్లందకుంట :** మండలంలోని గాలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న బాలికలకు గురువారం మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణను ప్రారంభించారు,గర్ల్ చైల్డ్ ఎంపవర్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఈ కార్యక్రమం ఇస్తున్నట్లు ప్రధానో పాధ్యాయురాలు మేకల పావని తెలిపారు, బాలికలకు భవిష్యత్తులో ధైర్యంగా తిరగడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, దీనిని బాలికలు పూర్తిస్థాయిలో వినియోగించాలని కోరినారు, ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ ఎల్ దేవరాజ్,ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

# బొక్కల గడ్డ శ్రీ శివ దుర్గా మందిరంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన!

## ముఖ్యఅతిథిగాపాల్గొన్న తోటరామారావు





**విజేత ఖమ్మం :** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఉన్న 47వ డివిజన్ బొక్కలగడ్డ లో శివ దుర్గా మందిరం 5వ వార్షికోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు మందిరంలో ధ్వజస్తంభం ఏర్పాటు చేసి ఐదు రోజులు పలు భక్తి పర్వ కార్యక్రమాలను వేలాదిమంది భక్తులతో ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా బి ఆర్ ఎస్ నాయకులు తోట రామారావు దంపతులు పాల్గొని భక్తులతో మమేకమై శివనామ స్వరాన్ని తిలకించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అనేకమంది దాతల సహాయ సహకారాలతో అన్న వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్న వితరణ కార్యక్రమానికి తోట రామారావు దంపతులు 20,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాటేటి నాగేశ్వరరావు అరుణ,కిషోర్, దయాకర్, డింగి రవి, గోపాల్ మరియు భక్తి బృందం పాల్గొన్నారు.

# ప్రథమ వార్షికోత్సవానికి ముస్తాబవుతున్న భవానీ శంకరాలయం...



**విజేత, మామడ :** మండలం లోని పొన్కల్ గ్రామంలో వందలయేళ్ల క్రితం నిర్మింపబడి శిథిలమైన శివాలయాన్నీ గత సంవత్సరం గ్రామస్తులు పునర్నిర్మించి వైభవం గా పున:ప్రతిష్టాపన చేయడం జరిగింది.ప్రథమ వార్షికోత్సవం తో పాటు మహాశివరాత్రి వేడుకలు కూడా ఘనం గా నిర్వహించడానికి ఏర్పాట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారము రోజున యాగశాల ప్రవేశం,ఆదివారము రోజున శివపార్వతుల కళ్యాణ మహోత్సవము,సోమవారము రోజున విశేష రుద్ర చండీ యాగ మహోత్సవం అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ కార్యక్రమాలు మరింత వైభవం గా నిర్వహించడానికి భక్తులు,దాతలు విరాళాలు అందజేస్తున్నారని ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

# జాతర ఏర్పాట్లపై అధికారుల సమీక్ష



**అక్షర విజేత కాగజ్ నగర్ ప్రతినిధి :** ఈస్గమ్లోని శివమల్లన్న ఆలయంలో రాబోయే జాతరను దృష్టిలో పెట్టుకొని అధికారులు సమీక్ష నిర్వహించారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుధ్యం, పార్కింగ్, రవాణా సదుపాయాలపై ప్రత్యేకంగా చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్ఆర్ఓ, ఆర్టీఓ, డీఎస్పీ, కాగజ్ నగర్ రూరల్ సీఐ, ఈస్గమ్ ఎస్సై, ఈఓ, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ కట్ట వెంకట్ రెడ్డిని పరామర్శించిన రసమయి



**విజేత ఇల్లంతకుంట :** మండలంలోని వంతడుపుల మాజీ సర్పంచ్ కట్ట వెంకట్ రెడ్డి తల్లి కట్ట సూర్యమ్మ ఇటీవల మృతి చెందగా మానకొండూర్ మాజీ శాసనసభ్యులు రసమయి బాలకిషన్ పరామర్శించారు.ఆయన వెంట జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి ,సెస్ డైరెక్టర్ మల్లిగారి రవిందర్ రెడ్డి, ఉప సర్పంచ్ ల ఫోరమ్ మాజీ మండల అధ్యక్షుడు ఎండి.సాదుల్ ,బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు అన్నాడి నవీన్ రెడ్డి, నాయకులు లక్ష్మణ్, పండుగ భాస్కర్, రవిందర్, చంద్రారెడ్డి, రవిందర్ రెడ్డి, దూలం అంజన్న తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ సెక్రటరీలు బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలి

## ఎంపీడీవో వెంకటేశ్వరరావు





**విజేత, పినపాక :** పినపాక మండల పరిధిలో గ్రామపంచాయతీ సెక్రటరీలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, అభివృద్ధి పనుల పర్యవేక్షణ వంటి అంశాలపై సెక్రటరీలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అమలు కావాలంటే గ్రామ స్థాయిలో సమర్థమైన పర్యవేక్షణ అవసరమని తెలిపారు.గ్రామ సభలను క్రమం తప్పకుండా నిర్వహించి, ప్రజల సమస్యలను నమోదు చేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రికార్డుల నిర్వహణ, పన్నుల వసూలు, అభివృద్ధి నిధుల వినియోగం వంటి విషయాల్లో నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు.గ్రామాల్లో జరుగుతున్న పనులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో స్పష్టం చేశారు. సమావేశంలో గ్రామపంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం...యువకుల ఔదార్యం



**విజేత, మామడ :** మండలంలోని తాంద్ర గ్రామంలో ఇటీవల ముచ్చింద్ల భీమన్న(35)అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు.మృతునికి భార్యగంగామణి, ఒక కుమార్తె శృతిక కలరు. ఆ కుటుంబ పరిస్థితి చూసి గ్రామ యువజన సంఘ నాయకుడు చేపూరి అజయ్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం గ్రామ యువకుల నుంచి తలా కొంత డబ్బులను చందాలుగా సేకరించి మొత్తం పదిహేడువేల రూపాయల నగదును మృతుని కుమార్తెకు అందజేయటం జరిగింది. కష్టకాలంలో తమ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకువచ్చి ఆర్థిక సహాయం చేసిన గ్రామ యువకులకు బాదిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# దేవరపల్లి మండల హాట్‌స్పాట్ గ్రామాల్లో వెట్టి విమోచనపై విస్తృత ప్రచారం




**విజేత దేవరపల్లి;** జిల్లా కన్వీనర్ విజయనిర్మల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు దేవరపల్లి వెట్టి విమోచన చట్టం స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకుని దేవరపల్లి మండలంలోని హాట్‌స్పాట్ గ్రామాల్లో వెట్టి చాకిరి నిర్మూలనపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వెట్టి విమోచన కోయిలేషన్ జిల్లా కన్వీనర్ శ్రీమతి విజయనిర్మల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. మండల పరిధిలోని ఇటుక బట్టీలు, ఫ్యాక్టరీలు, చిన్న పరిశ్రమలు, ఆటో స్టాండ్లు మరియు కార్మికులు అధికంగా పనిచేసే ప్రాంతాల్లో ప్రత్యక్ష ప్రచారంతో పాటు ఆటోలో ఆడియో ప్రకటనల ద్వారా చట్టంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గ్రామ గ్రామాల్లో ఆటో ద్వారా మైక్ సౌకర్యంతో వెట్టి చాకిరి నేరమని, అప్పుల పేరుతో బలవంతపు శ్రమకు గురిచేయడం చట్టవిరుద్ధమని ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ, వలస కార్మికులు మరియు అట్టడుగు వర్గాల ప్రజలు వెట్టి చాకిరికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున వారిలో చట్టంపై అవగాహన పెంపొందించడం అత్యవసరమని తెలిపారు. పోస్టర్లు, పాంప్లెట్లు పంపిణీ చేస్తూ కార్మికులతో ప్రత్యక్షంగా మాట్లాడి చైతన్యం కల్పించారు. మండలంలో వెట్టి చాకిరి పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వ యంత్రాంగం, కార్మిక శాఖ మరియు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు నిర్వాహ కులు పేర్కొన్నారు. ఈ ప్రచారాన్ని మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపారు.

# ఎన్నికల కౌంటింగ్ వద్ద అప్రమత్తంగా ఉండాలి

## మక్తల్ సీఐ రామ్ లాల్




**విజేత కృష్ణ :** జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీస్ ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు విధుల్లో పాల్గొంటున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి మక్తల్ సీఐ రామ్ లాల్ భద్రతాపరమైన కీలక సూచనలు జారీ చేశారు. కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కౌంటింగ్ సెంటర్‌లోకి కేవలం పోటీ చేసిన అభ్యర్థి, ఎలక్షన్ ఏజెంట్, కౌంటింగ్ ఏజెంట్‌లకు మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. అనుమతి లేని వ్యక్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ లోపలికి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ సెంటర్‌లోకి ద్రవపదార్థాలు, సెల్ ఫోన్లు, అగ్గిపెట్టె మరియు ఇతర నిషేధిత వస్తువులు తీసుకురావడం పూర్తిగా నిషేధమని తెలిపారు. ప్రవేశ ద్వారాల వద్ద ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి మాత్రమే అనుమతించాలన్నారు. మీడియా ప్రతినిధులు కూడా తప్పనిసరిగా అక్రెడిటేషన్ కార్డు కలిగి ఉండాలని, సరైన గుర్తింపు పత్రాలు ఉన్నవారికి మాత్రమే ప్రవేశం కల్పించాలని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా చేరకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సమన్వయంతో పని చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలు, అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

## ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె



**విజేత పిట్లం :** ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం సార్వత్రిక సమ్మె నిర్వహించారు. ఈ సమ్మెను ఉద్దేశించి జిల్లా అధ్యక్షుడు బుర్రెం బాల్‌రాజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు వీరోచిత పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను సవరించి నాలుగు కార్మిక కోడ్‌లుగా మార్చడాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన కోరారు. ఈ కోడ్‌లు అమలైతే దేశంలోని కార్మికులకు తీరని నష్టం జరుగుతుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చే విధంగా విధానాలు అమలు చేస్తూ కార్మికుల కష్టాన్ని దోచుకుంటుందని విమర్శించారు. కనీస వేతనాలు నిర్ణయించకపోవడం, ఔట్‌సోర్సింగ్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించకపోవడం, మరణించిన కార్మికులకు పరిహారం ఇవ్వకపోవడం వంటి చర్యలను ఖండించారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న భవన కార్మికులు, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఉపాధి హామీ పథకం కార్మికులు, జాతీయ ఆరోగ్య పథకం కార్యకర్తలను కార్మికులుగా గుర్తించకపోవడం దురదృష్టకరమన్నారు. కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే కార్మికులకు జీతాలు చెల్లించాలని, ప్రభుత్వ రంగ సంస్థల వాటాల విక్రయాన్ని నిలిపివేయాలని, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలను వెనక్కి తీసుకోకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రాజేష్, పీరయ్య, శ్రీను, సాయికుమార్, బాలయ్య, కృష్ణ తదితర కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్ద శంకరంపేట మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ గైర్హాజరు

వారం రోజులుగా ప్రిన్సిపల్ కుర్చీ ఖాళీగా దర్శనం

బాధ్యతలు ఇంచార్జ్‌లకు అప్పగింపు పై ఆగ్రహం

పదో తరగతి పరీక్షల ముందు నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ఆందోళన

ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్






**విజేత, పెద్ద శంకరంపేట్:** పెద్ద శంకరంపేట మోడల్ స్కూల్‌లో గత వారం రోజులుగా ప్రిన్సిపల్ గైర్హాజరు కావడం చర్చనీయాంశమైంది. పాఠశాల నిర్వహణ బాధ్యతలను ఇంచార్జ్‌లకు అప్పగించి ప్రిన్సిపల్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులకు ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఇలాంటి కీలక సమయంలో ప్రధానోపాధ్యాయుడు పాఠశాలలో లేకపోవడం విద్యా ప్రమాణాలపై ప్రభావం చూపుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల నిర్వహణ, తరగతుల పర్యవేక్షణ, అకాడమిక్ ప్రణాళికల అమలులో లోపాలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పరిస్థితిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి.

## టిడిపి నాయకులకు పరామర్శ



**విజేత దేవరపల్లి :** దేవరపల్లి మండలం దేవరపల్లి గ్రామంలో టిడిపి నాయ కులు యాగంటి వెంకటేశ్వరరావు శ్రీనివాస్ సాయి బాబు వారి తల్లి యాగంటి నారాయణమ్మ ఇటీవల కాలంలో స్వర్గస్తులైనారు వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆవిడ ఆత్మకు శాంతి కలగాలని కోరుకొనడం జరిగినది ఈ కార్యక్రమంలో స్త్రీ శక్తి మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు మరియు హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ షఫీకా కుమారి మరియు మహిళా సంఘం నాయకులు నూలు కుమారి పీట్ల మరియమ్మ ఉప్పనపల్లి మేరీ కుమారి కృష్ణవేణి నాగమణి తదితర మహిళా సంఘం నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది

## శ్రీ కనకదుర్గ టెక్స్టైల్ బంపర్ డ్రా వేడుకల్లో సందడి



**విజేత, పెద్ద శంకరంపేట్:** పెద్ద శంకరంపేటలోని శ్రీ కనకదుర్గ టెక్స్టైల్ సంస్థ మొదటి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన బంపర్ డ్రా కార్యక్రమం ఘనంగా జరిగింది. వినియోగదారుల ఆదరణతో విజయవంతంగా ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా యాజమాన్యం ప్రత్యేక బహుమతుల డ్రాను నిర్వహించింది. ఈ బంపర్ డ్రాలో మొదటి బహుమతిగా రూ. 55,000 విలువైన ఎలక్ట్రానిక్ స్కూటీని మూసాపేట్‌కు చెందిన రాములు గెలుచుకున్నారు. రెండవ బహుమతిగా రూ. 15,000 నగదు బహుమతిని జ్యోతి (జూకల్) అందుకున్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద శంకరంపేట ఎస్సై ప్రవీణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు అసురీ మురళి పంతులు, సంస్థ యాజమాన్యం మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాజమాన్యం మాట్లాడుతూ, వినియోగదారుల విశ్వాసం, మద్దతుతోనే సంస్థ విజయవంతంగా ముందుకు సాగుతోందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది..

## భక్తి శ్రద్ధలతో శబరిమాతా ఆశ్రమ వార్షికోత్సవం..



**విజేత, మామడ:** మండలంలోని పొన్కల్ గ్రామంలో శబరిమాత ఆశ్రమ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. శబరిమాత శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు శ్రీరామ జయరామ జయ జయ రామా అంటూ భజన పాటలు పాడుకుంటూ నృత్యాలు చేసుకుంటూ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శబరిమాత శిష్యులు,భక్తులు పాల్గొన్నారు.

## క్రీడాకారులు క్రీడలో కసితో సాధన చేస్తేనే విజయం సాధిస్తారు






రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



**విజేత రేవల్లి వనపర్తి ప్రతినిధి :** వనపర్తి జిల్లా గోపాల్పేట మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేందర్ రెడ్డి ఆహ్వానం మేరకు వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గస్థాయి సీఎం కప్ బహుమతుల ప్రధానోస్తవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరైనారు. ఆయన మాట్లాడుతూపల్లెలో ఉన్న ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికి తీయడానికి సీఎం రేవంత్ రెడ్డి సీఎం కప్ నిర్వహిస్తున్నారని అన్నారు. పల్లెలో కబడ్డీ, కోకో, వాలీబాల్ వంటి క్రీడలను పల్లెలో ఉండే క్రీడాకారులు ఎక్కువ నైపుణ్యం కలిగి దృఢంగా ఉంటారని అన్నారు. క్రీడాకారులు ఆటను రోజు సాధన చేస్తేనే క్రీడాకారులుగా రూపుదిద్దుకుంటారని అన్నారు. క్రీడాకారుల స్వభావం స్మూత్ గా ఉండాలి క్రీడలో మాత్రం కసిగా ఉండాలని అన్నారు. క్రీడాకారులు నగదు కోసం ఆడకుండా తన గుర్తింపు కోసం ఆడాలని అన్నారు. వనపర్తి లో ఎక్కువ మంది క్రీడాకారులను తయారు చేసింది నారాయణదాసు గారని వారి శిష్యరికంలో మెలుకువలు నేర్చుకున్న క్రీడాకారులే ఈరోజు పీటీలుగా ఉన్నారని అన్నారు. జిల్లాస్థాయి క్రీడలో గెలుపొందిన క్రీడాకారులు ఆటను మెరుగుపరచుకొని రాష్ట్రస్థాయి లో జరిగే క్రీడలలో విజేతలుగా నిలిచి వనపర్తి జిల్లాకు నుంచి గుర్తింపు తేవాలని క్రీడాకారులను ప్రోత్సహించారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు చిన్నారెడ్డి బహుమతులు ప్రధానం చేశారు. కబడ్డీ బాలురు అమర్ చింత రన్నర శ్రీరంగాపురం విన్నర్కబడ్డీ బాలికలు పాన్ గాల్ రన్నర్ ఆఫ్అమరచింత విన్నర్కోకో బాలురు కొత్తకోట రన్నర్ ఆఫ్ పెద్దమందడి విన్నర్వాలీబాల్ బాలురు పాన్ గాల్ రన్నర్ ఆఫ్ మదనాపురం విన్నర్ బాలికలు వాలీబాల్ వనపర్తిరన్నర్ ఆఫ్ కొత్తకోట విన్నర్. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల పరిశీలకులు సుధీర్ రెడ్డి,వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాబా,వనపర్తి మండల్ సింగల్ విండో మాజీ అధ్యక్షులు సహదేవుడు, వనపర్తి మండల్ ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, వివిధ మండలాల క్రీడా ఉపాధ్యాయులు,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి అధికారిక సెలవు ప్రకటించాలి

రాష్ట్ర కోఆర్డినేటర్ కాట్రోత్ రవీందర్ నాయక్ డిమాండ్



**విజేత పిట్లం :** బంజారాల ఐదవ గురువు, ఆరాధ్య దైవం సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15వ తేదీన కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అధికారిక సెలవు దినంగా ప్రకటించాలని లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ కాట్రోత్ రవీందర్ నాయక్ డిమాండ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న లంబాడి--బంజారా సమాజానికి ఆధ్యాత్మిక మార్గదర్శకుడిగా, సంస్కృతి పరిరక్షకుడిగా, ధర్మరక్షకుడిగా సేవాలాల్ మహారాజ్ నిలిచారని ఆయన పేర్కొన్నారు. బంజారా జాతి అభ్యున్నతి కోసం ఆయన చేసిన త్యాగాలు, సమాజ చైతన్యం కోసం చేసిన కృషి, హిందూ ధర్మ పరిరక్షణకు అందించిన సేవలు అపారమైనవని తెలిపారు. ఆయన చూపించిన మార్గం సమానత్వం, నీతి, సేవాభావం, ఐక్యతకు ప్రతీకగా నిలిచిందన్నారు. ఇతర సామాజిక వర్గాల మహనీయుల జయంతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారిక సెలవులు ప్రకటిస్తున్న నేపథ్యంలో, లంబాడి--బంజారా సమాజానికి ఆధ్యాత్మిక ప్రేరణగా నిలిచిన సేవాలాల్ మహారాజ్ జయంతికి కూడా అధికారిక సెలవు ప్రకటించడం సముచితమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కేవలం క్యాజువల్ లీవ్ ఇవ్వడం సరిపోదని, అధికారిక సెలవు దినంగా ప్రకటించాలని ప్రభుత్వాలను కోరారు. అదే విధంగా సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమాల్లో రాజకీయ పార్టీల ప్రమేయం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జయంతి దైవ కార్యక్రమమని, రాజకీయ కార్యక్రమంగా మారకుండా చూడాలని తెలిపారు. ఆహ్వాన కమిటీల్లో లంబాడి పెద్దలు, కుల సంఘాల నాయకులు, తండాల నాయకులు, లంబాడి--బంజారా జాతి అభ్యున్నతికి పనిచేసే నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రాజకీయ కండువాలు ధరించిన వారిని మాత్రమే ఆహ్వానించి, నిజంగా జాతి కోసం పోరాటం చేసే వారిని విస్మరిస్తే తీవ్ర నిరసనలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

**గమనిక:** ఫిబ్రవరి 15న తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి తండాలో సేవాలాల్ మహారాజ్ మరియు జగదంబ మాత మందిరాల వద్ద భోగ్ బండార్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు

## ప్రజలలో ఈ కేవైసీ గురించి అవగాహన సదస్సు ఏర్పాటుచేసిన ఉప్పల్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్

**విజేత, కమలాపూర్:** కమలాపూర్ మండలం, ఉప్పల్ గ్రామంలో ఫైనాన్షియల్ లిటరసీ వీక్ కార్యక్రమం లో భాగంగా కేవైసీ అప్ డేటింగ్ గురించి మన ఉప్పల్ గ్రామంలో అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో హన్మకొండ డిస్టిక్ ఎఫ్ఎల్సి మదన్ గోపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బ్యాంక్ అకౌంట్ కలిగి ఉన్నవారు ప్రతి ఒక్కరూ కేవైసీ ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని ఈ కార్యక్రమంలో తెలిపినారు ఒకవేళ కేవైసీ అప్డేట్ చేసుకోకపోతే సైబర్ నేరగాళ్ల బారిన పడే అవకాశం ఉందని వివరించారు అదేవిధంగా సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్ బ్యాంకుల పట్ల ఉండేటువంటి అన్ని లోన్స్ గురించి మన హనుమకొండ డిస్టిక్ ఎఫ్ఎల్సి మదన్ గోపాల్ వివరించారు సైబర్ క్రైమ్స్ సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్ ఉద్గం పోర్టల్ సుకన్య సమృద్ధి యోజన లాంటి విషయాలపై మదన్ గోపాల్ గారు క్లుప్తంగా గ్రామ ప్రజలకు వివరించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో ఉప్పల్ తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో



ఉన్నటువంటి ఫెసిలిటీస్ ను అందరు కూడా వినియోగించుకోవాలని తెలియజేశారు ఎం ఎస్ ఎం ఈ ముద్ర లోన్స్ గురించి శ్రీ వెంకటేశ్వర్లు



వివరించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వార్డ్ మెంబర్స్ గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

## కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన లేబర్ నాలుగు కోడ్ ను రద్దు చెయ్యాలి




ఏఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి. దత్తు నాయక్

**విజేత మహేశ్వరం :** కార్మికుల గొంతుపై కత్తిలాంటి నాలుగు లేబర్ కోడ్ లను రద్దు వరకు పోరాడాలి కార్మిక బ్రతుకులను మార్చే ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి దత్తు నాయక్, ఐ ఎన్ టి యు సి మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షులు నడికుడి శివ లు పిలుపునిచ్చారు. గురువారం జరిగిన సార్వత్రిక సమ్మె లో భాగంగా మహేశ్వరశీ ,మండల కేంద్రం , మహేశ్వరం పారిశ్రామిక ప్రాంతం, మంకల్, ఫ్యాబ్ ఈ సిటీ, తుక్కుగూడ, హార్డ్వేర్ పార్క్, కేంద్రాలలో ర్యాలీ, బహిరంగ సభ, బైక్ ర్యాలీ, రెండు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా దత్తు నాయక్ శివ లు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ ల ను తెచ్చి బ్రిటిష్ కాలం నాడు పోరాడి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వాల దయ దక్షిణాల తో




29 కార్మిక చట్టాలు రాలేదని కార్మిక వర్గం తెగించి పోరాడితే 29 కార్మిక చట్టాలు వచ్చాయని ఆ చట్టాలను నేడు నరేంద్ర మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఆయన మండిపడ్డారు. 2019 సంవత్సరం నుండి కార్మిక వర్గంపై కేంద్ర ప్రభుత్వం యుద్ధం చేస్తున్నదని ఈ యుద్ధంలో కార్మిక వర్గం గెలవాలని నాలుగు లేబర్ కోడ్ లను వ్యవసాయ నల్ల చట్టాలను వెనక్కి తీసుకునే వరకు పోరాడాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని కనీస వేతనాలు అమలు కావడం లేదని ఆయన తెలిపారు పర్యవేక్షణ చేయాల్సిన లేబర్ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం బాధాకరమని ఆయన విమర్శించారు. భవిష్యత్తులో కార్మికుల సమస్యల పైన ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ఈ సమ్మె భారతదేశానికి కార్మిక వర్గానికి ఉపయోగపడే సమ్మె అని ఈ సమ్మెలో పాల్గొన్న కార్మికులందరికీ విప్లవాభి వందనాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు కొమ్మగల రాజు, ఐ ఎన్ టి యు సి






నాయకులు రాకేష్ నరసింహ నవీన్ గణేష్ ఏఐటియుసి నాయకులు,వైట్ క్లిప్ జనరల్ సెక్రటరీ ఎన్ యాదగిరి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి డి .బ్రహ్మచారి, సాయి కల్పన వెంకటమ్మ సుందరయ్య శివ నరసింహ రవి అంజి తదితరులు పాల్గొన్నారు.




## మెదక్ మున్సిపాలిటీలో గులాబి జెండా ఎగరవేయడం ఖాయం

మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి

**విజేత,పాపన్నపేట :** మెదక్ మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగురడం ఖాయమని బిఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి, ఫారుఖ్ హుస్సేన్ లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ లో పార్టీ ఇచ్చిన ఇన్చార్జిల వార్డుల్లో నిరంతరం పనిచేసిన మండల నాయకులతో ఇంచార్జ్ ఫారుక్ హుస్సేన్, మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి లు కలసి ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట మండలం టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జి విష్ణువర్ధన్ రెడ్డి, మెదక్ జిల్లా రైతు సేవా సమితి మాజీ అధ్యక్షులు టి సోములు, మండల సర్పంచ్ ల ఫోరమ్ మాజీ అధ్యక్షులు, కొత్తపల్లి సర్పంచ్ కుమ్మరి జగన్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెంకట్రామిరెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త వెంకటేశం, మాజీ సర్పంచ్ మర్రి లింగారెడ్డి, రామతీర్థం సర్పంచ్ సాయి రెడ్డి, గాంధారిపల్లి అంజి రెడ్డి, ఆరేపల్లి మాజీ సర్పంచ్ శ్రీనాథ్ రావు, తదితరులు ఉన్నారు.

## ఉచితంగా రూ.5 లక్షల ఆరోగ్య బీమా.. మీరు అప్లై చేసారా

సీనియర్ సిటిజన్లు, పేద కుటుంబాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ముఖ్యమైన ఆరోగ్య పథకం ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన ఆరోగ్య యోజన




సీనియర్ సిటిజన్లు, పేద కుటుంబాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ముఖ్యమైన ఆరోగ్య పథకం ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన ఆరోగ్య యోజన (పీఎం-జేఏవై). ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం ఆర్థికంగా బలహీన వర్గాల ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం. చాలా పేద కుటుంబాలు, వయోవృద్ధులు, పెద్ద జబ్బులు వచ్చినప్పుడు ఆసుపత్రి ఖర్చులు భరించలేక అప్పుల్లో పడిపోతుంటాయి. అలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రతి సంవత్సరం ఒక కుటుంబానికి రూ.5 లక్షల వరకు ఉచిత చికిత్స సౌకర్యం లభిస్తుంది. ఈ సౌకర్యం ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ఎంపిక చేసిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా అందుబాటులో ఉంటుంది. ఈ పథకం ముఖ్యంగా పేద కుటుంబాలు, అసంఘటిత రంగ కార్మికులు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న బలహీన వర్గాలు, సీనియర్ సిటిజన్లకు ఎంతో ఉపయోగపడుతోంది. ఆసుపత్రిలో అడ్మిట్ అవాల్సిన చికిత్సలు, శస్త్రచికిత్సలు, పరీక్షలు, మందులు, ×జఖ సేవలు వంటి అనేక ట్రీట్మెంట్స్ ఈ పథకం కింద కవర్ అవుతాయి. రోగి ఆసుపత్రిలో చేరినప్పటి నుంచి డిశ్చార్జ్ అయ్యే వరకు అయ్యే ఖర్చులు ఈ పథకం ద్వారా చెల్లించబడతాయి. దీనికి కుటుంబానికి ప్రత్యేకమైన గోల్డెన్ కార్డ్ లేదా ఆయుష్మాన్ కార్డ్ ఇస్తారు. ఈ కార్డ్ చూపిస్తే దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో క్యాష్‌లెస్ చికిత్స పొందవచ్చు. అంటే ముందుగా డబ్బు చెల్లించాల్సిన అవసరం ఉండదు. సీనియర్ సిటిజన్లకు ఈ పథకం మరింత ఉపయోగకరంగా మారింది. వృద్ధులకు సాధారణంగా గుండె, కిడ్నీ, మధుమేహం, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ చికిత్సలకు భారీ ఖర్చు అవుతుంది. అలాంటి సమయంలో ఆయుష్మాన్ భారత్ పథకం ఒక పెద్ద ఆర్థిక భరోసా ఇస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ పథకం గురించి అవగాహన పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తోంది.

## మిమ్మల్ని ఎవరైనా ఇష్టపడుతున్నారా..
## ఇలా తెలుసుకోవచ్చు సింపుల్‌గా..!

ఎవరైనా మిమ్మల్ని ఎక్కువగా ఇష్టపడుతుంటే లేదా రహస్యంగా ప్రేమిస్తుంటే వారు మీతో చెప్పకపోయినప్పటికీ.. కొన్ని సైకలాజికల్ సంకేతాలు ఆధారంగా గుర్తించవచ్చు అంటారు నిపుణులు.



ఏడాది మొత్తంలో ఫిబ్రవరి నెలకో స్పెషాలిటీ ఉంది. అదే.. వాలెంటైన్స్ వీక్. ముఖ్యంగా యువత తమకు ఇష్టమైన వ్యక్తులకు లవ్ ప్రపోజ్ చేయడానికి, అప్పటికే ప్రేమలో ఉన్నవారు హ్యాపీగా సెలబ్రేట్ చేసుకోవడానికి ఈ సందర్భాన్ని ఒక అవకాశంగా భావిస్తారు. ఇక ఫిబ్రవరి 14 వాలెంటైన్స్ డేను ప్రత్యేకంగా పరిగణిస్తారు చాలామంది. మొత్తానికి ప్రేమ, ఆకర్షణల చుట్టూ తిరిగే ప్రేమికుల దినోత్సవం నేపథ్యంలో ఒక వ్యక్తి మరొక వ్యక్తిని ఇష్టపడుతున్నారని తెలిపే సంకేతాలేవి? నిపుణులు ఏం చెబుతున్నారో చూద్దాం. ఎవరైనా మిమ్మల్ని ఎక్కువగా ఇష్టపడుతుంటే లేదా రహస్యంగా ప్రేమిస్తుంటే వారు మీతో చెప్పకపోయినప్పటికీ.. కొన్ని సైకలాజికల్ సంకేతాల ఆధారంగా గుర్తించవచ్చు అంటారు నిపుణులు. అయితే కచ్చితంగా ఇవి మాత్రమే ప్రేమ సంకేతాలు అని చెప్పడానికి బలమైన శాస్త్రీయ ఆధారాలైతే లేవు. కానీ మానసిక నిపుణుల ప్రకారం కొన్ని హవ భావాలను, ప్రవర్తను బట్టి ఎదుటి వ్యక్తి మిమ్మల్ని ఇష్టపడుతున్నారో లేదో అర్థం చేసుకోవచ్చు.

కళ్లల్లో కనిపిస్తుంది!

ఒక వ్యక్తి మిమ్మల్ని బాగా ఇష్టపడుతుంటే లేదా మీ పట్ల అట్రాక్ట్ అయితే గనుక ఆ వ్యక్తిలో కొన్ని సంకేతాలు కనిపిస్తాయని నిపుణులు చెప్తున్నారు. ముఖ్యంగా మీతో మాట్లాడుతున్నప్పుడు ఆమె లేదా అతని కళ్లు సహజంగానే వ్యాకోచిస్తాయి. వాస్తవానికి ఇది నాడీ వ్యవస్థ ద్వారా నియంత్రించబడే అసంకల్పిత ప్రతిస్పందన. అత్యంత ఆసక్తి, ఉద్రేకానికి సంకేతం. కాబట్టి.. ఎవరైనా మీతో మాట్లాడుతున్నప్పుడు అసంకల్పితంగా కళ్లను ఎక్కువసార్లు కదపడం, పెద్దవిగా చేసి మీ వైపు చూడటం, కనురెప్పలు తరచుగా కొట్టుకోవడం వంటి సంకేతాలు కనిపిస్తే వారు మీ పట్ల ఆసక్తితో ఉన్నట్లు అర్థం చేసుకోవచ్చు.

మిమ్మల్ని ఫాలో అవుతారు

అనుకరించడం లేదా మిర్రరింగ్ అనేది మిమ్మల్ని ఇష్టపడే వ్యక్తిలో కనిపించే మరో లక్షణం. ఒక విధంగా ఇష్టమైన వ్యక్తులపట్ల చూపించే సబ్ కాన్సియస్ వే. మీ పట్ల ఆసక్తి కలిగిన వ్యక్తి బాడీ లాంగ్వేజ్, ముఖ కవళికలు లేదా మాటతీరు లేదా పలు ఇతర విషయాల్లో మిమ్మల్ని అనుకరించడానికి ప్రయత్నిస్తారు. కాబట్టి ఒక వ్యక్తి తరచూ మీ వ్యవహారశైలిని కాపీ చేస్తున్నట్లు అనిపిస్తుందో లేదో గమనించండి. ఎందుకంటే వారు మీపట్ల ఆకర్షితులయ్యారనడానికి ఇదొక సంకేతం కావచ్చు.

జుట్టును సవరించుకోవడం..

మిమ్మల్ని ఇష్టపడే వ్యక్తి మీ దగ్గరగా ఉన్నప్పుడు, ఆ వ్యక్తి మీకు బెస్ట్ లుకింగ్‌లో కనిపించాలని ఆరాటపడతారు. మీరు గమనించినప్పుడల్లా అనుకోకుండా తమ క్లాతింగ్‌ను సరిచేసుకోవడం, జుట్టును సరిచేయడం వంటివి చేస్తారు. అంతేకాకుండా మీకు మరింత ఆకర్షణీయంగా కనిపించేలా వివిధ భంగిమల్లో నుల్చోవడం, కూర్చోవడం, మీరు దగ్గరగా ఉన్నప్పుడు సాధారణం కంటే ఎక్కువసార్లు తమను తాము చూసుకోవడం చేస్తుంటారు. ఇదంతా మిమ్మల్ని ఆకట్టుకోవడంలో ఒక భాగం.

ఫిజికల్ టచ్ కోసం ఆరాటం..

ఒకరిపట్ల ఒకరు ఆకర్షితులయ్యే వ్యక్తులు తరచుగా యాదృచ్ఛిక ఫిజికల్ కాంటాక్ట్‌ను ప్రదర్శించే ప్రయత్నం చేస్తారు. మీకు ఏదైనా వస్తువు ఇవ్వాలనుకున్నప్పుడు మీ చేతిని కావాలని తాకడం, మరీ దగ్గరగా వచ్చి మాట్లాడటం వంటివి చేస్తుంటారు. అసాధారణంకంటే ఎక్కువగా మిమ్మల్ని తాకడానికి ట్రై చేస్తుంటారు. అయితే కొన్నిసార్లు టచింగ్ అనేది ఇష్టపడకపోయినా సహజంగా ఉండవచ్చు. కాబట్టి ప్రతి టచింగ్ ప్రేమ, ఆకర్షణ అనుకోవాల్సిన అవసరం లేదు. ఇక్కడ సందర్భం, సాంస్కృతిక నిబంధనలను కూడా పరిగణనలోకి తీసుకోవడం చాలా ముఖ్యం.

ఎక్కువ శ్రద్ధ, ఎక్కువ ఆసక్తి

మిమ్మల్ని ఇష్టపడే వ్యక్తి ఇతరుల కంటే కూడా మీ పట్ల ఎక్కువ శ్రద్ధ చూపుతారు. మీరు చెప్పే విషయాలను ఆసక్తిగా వినడం, గుర్తుంచుకోవడం చేస్తుంటారు. ఏదైనా చెప్పినప్పుడు మరింత ఆసక్తిగా ప్రశ్నలు అడుగుతుంటారు. ఎందుకంటే వారు మిమ్మల్ని బాగా తెలుసుకోవాలనే ఆసక్తిని కలిగి ఉంటారు. అలాగే మిమ్మలి ఇష్టపడే వ్యక్తి మీతో ఎక్కువసేపు ఉండాలని ట్రై చేస్తుంటారు. మీతో సమయం గడపడానికి సాకులు వెతుకుతుంటారు. బ్రీఫ్ ఇంటరాక్షన్ కోసం కూడా గంటలకొద్దీ కేటాయిస్తారు. అలాగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు తమతో రావాలని కోరుతుంటారు.

మాటల్లో తడబాటు..

ఒక వ్యక్తి మిమ్మల్ని సాధారణంకంటే ఎక్కువగా ఇష్టపడుతున్నట్లయితే లేదా ప్రేమిస్తున్నట్లయితే ఆ విషయం మీతో ఎప్పుడూ చెప్పి ఉండరు. ఇలాంటివారు మీతో మాట్లాడుతున్నప్పుడు కుదురుగా ఉండలేరు. పైగా మీతో మాట్లాడే సందర్భంలో వారి మాటలు తడబడుతుంటాయి. ఏదో ఆందోళన కనిపించవచ్చు. గొంతు తడి ఆరినట్లు అనిపించవచ్చు. దీనిని బట్టి ఆ వ్యక్తి మిమ్మల్ని ప్రత్యేకంగా భావిస్తున్నారని అర్థం చేసుకోవచ్చు. అలాగని ఇలాంటి సందర్భాలన్నీ ప్రేమ సంకేతాలే కాకపోవచ్చు. కొందరిలో బిడియం, ఆందోళన కూడా ఇందుకు కారణం అవుతుంటాయి.

ఫీట్ డైరెక్షన్, ఐ కాంటాక్ట్

ఒక వ్యక్తి బాడీ లాంగ్వేజ్ కూడా వారి గురించి చాలా చెబుతుంది. కాబట్టి మీరు ఒక వ్యక్తితో మాట్లాడుతున్నప్పుడు వారి పాదాల డైరెక్షన్‌పై శ్రద్ధ వహించండి. వారి పాదాలు ఎక్కువగా మీ వైపు చూపడం, నడుస్తున్నప్పుడు, వివిధ సందర్భాలను బట్టి వారి పాదాలు మీ పాదాలకు టచ్ అయ్యేలా చేయడం వంటివి చేస్తుంటే మీ పట్ల ఆసక్తి కలిగి ఉన్నారనడానికి అర్థం. అలాగే ఒక వ్యక్తి సాధారణంకంటే ఎక్కువగా మీవైపే చూడటం, మిమ్మల్నే అబ్జర్వ్ చేయడం, మీ కళ్లవైపు గమనిస్తూ మాట్లాడటం కూడా ఆసక్తి కలిగి ఉన్నారనడానికి సంకేతం.

## టీ20 ప్రపంచ కప్..కష్టాల్లో భారత్, సంజూకు మాత్రం పండగే !

అభిషేక్ శర్మ అనారోగ్యమే. అమెరికాతో మ్యాచ్ పూర్తయిన తర్వాత అభిషేక్ శర్మ చాలా డల్ గా కనిపిస్తున్నాడు. అతనికి వైరల్ ఫీవర్ సోకింది. దానికి తోడు కడుపునొప్పి కూడా వేధిస్తోందట.



టీ20 వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్ నేపథ్యంలో భారత జట్టు పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. ఇండియాను గాయాల బెడద పట్టిపీడిస్తోంది. ఈ టోర్నమెంట్ ప్రారంభమైన నుంచి జ్వరాలు లేదా గాయాలు భారత జట్టును వేధిస్తున్నాయి. టీ20 వరల్డ్ కప్ సందర్భంగా మొదటి మ్యాచ్ కు బుమ్రా దూరమైన సంగతి తెలిసిందే. అతనికి మ్యాచ్ కంటే ముందు వైరల్ ఫీవర్ సోకిందట. ఇక ఇప్పుడు అభిషేక్ శర్మకు కూడా ఇదే పరిస్థితి నెలకొంది. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా జట్టుతో మ్యాచ్ పూర్తయిన తర్వాత అభిషేక్ శర్మకు జ్వరం విపరీతంగా వచ్చినట్లు చెబుతున్నారు. దీంతో ఇండియా ఆడబోయే రెండో మ్యాచ్ కు అభిషేక్ శర్మ దూరం కాబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

సంజు శాంసన్ కు బంపర్ ఆఫర్

టీ20 వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్ లో భారత జట్టు తన తర్వాతి మ్యాచ్ నమీబియాతో ఆడనుంది. ఈ మ్యాచ్ ఢిల్లీలో ఫిబ్రవరి 12వ తేదీన జరుగుతుంది. ఇలాంటి నేపథ్యంలో సంజు శాంసన్ కు బంపర్ ఆఫర్ తగిలినట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. దీనికి కారణం అభిషేక్ శర్మ అనారోగ్యమే. అమెరికాతో మ్యాచ్ పూర్తయిన తర్వాత అభిషేక్ శర్మ చాలా డల్ గా కనిపిస్తున్నాడు. అతనికి వైరల్ ఫీవర్ సోకింది. దానికి తోడు కడుపునొప్పి కూడా వేధిస్తోందట. ఈ తరుణంలో ఇండియా ఆడబోయే రెండవ వరల్డ్ కప్ మ్యాచ్ కు అభిషేక్ శర్మ దూరమవుతాడని అంటున్నారు. ఇదే జరిగితే, ఓపెనర్ అభిషేక్ శర్మ స్థానంలో సంజు శాంసన్ కు ఛాన్స్ వస్తుందని అంటున్నారు. ఇప్పటికే సంజు కు ఓపెనర్ గా చేసిన అనుభవం ఉంది. న్యూజిలాండ్ తో జరిగిన ఐదు టీ20 మ్యాచ్ లలో విఫలమైనప్పటికీ, సంజు శాంసన్ కు అవకాశం వస్తుందని అంటున్నారు. ఇదే జరిగితే వికెట్ కీపర్ గానే కాకుండా ఓపెనర్ గా సంజు బరిలోకి దిగుతాడు. అంటే అభిషేక్ శర్మ అనారోగ్యం, సంజు శాంసన్ కు కలిసివచ్చే ఛాన్సులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

రెండో మ్యాచ్ కు సిద్ధమైన భారత జట్టు

వరల్డ్ కప్ ఎలాగైనా గెలవాలన్న కసితో ఇండియా ముందుకు వెళ్తోంది. గాయాలు వేధించినప్పటికీ కూడా మిగిలిన ప్లేయర్లతో టైటిల్ కొట్టాలన్న కసి కనిపిస్తోంది. ఈ తరుణంలో ఇండియా తన రెండవ మ్యాచ్ నమీబియాతో ఆడనున్న సంగతి తెలిసిందే. ఈ రెండు జట్ల మధ్య ఢిల్లీలోని అరుణ్ జెట్లీ వేదికగా ఫైట్ జరగనుంది. అయితే ఇప్పటికే అమెరికా జట్టుపై విజయం సాధించిన భారత జట్టు, నమీబియాను చిత్తు చేయాలని ప్లాన్ చేస్తోంది. ఈ నమీబియాతో విజయం సాధిస్తే పాకిస్తాన్ జట్టుతో మరో మ్యాచ్ ఆడనుంది భారత జట్టు. నమీబియా తో మ్యాచ్ కోసం మొన్ననే ఢిల్లీకి వచ్చింది భారత జట్టు. ఈ సందర్భంగా భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్పెషల్ ట్రీట్ కూడా ఇచ్చాడు. భారత ప్లేయర్లు అందరికీ విందు ఇచ్చి సర్ప్రైజ్ చేశాడు గంభీర్.

## ఆసుపత్రిలో అభిషేక్ శర్మ- నమీబియాతో జరిగే టీ20 మ్యాచ్‌లో ఆడటం డౌటే!

కడుపులో ఇన్ఫెక్షన్‌తో ఆసుపత్రిలో చేరిన క్రికెటర్ అభిషేక్ శర్మ - ఢిల్లీలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో రెండు రోజులుగా చికిత్స - గురువారం నమీబియాతో జరిగే టీ20 మ్యాచ్‌లో ఆడటంపై సందిగ్ధత



టీ20 ప్రపంచ కప్‌లో భారత జట్టుకు ఊహించని షాక్ తగిలింది. జట్టులో డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరడం ఆందోళన కలిగిస్తోంది. కడుపులో ఇన్ఫెక్షన్ కారణంగా ఆయన ఢిల్లీలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. గురువారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో నమీబియాతో జరిగే కీలక మ్యాచ్‌కు అభిషేక్ దూరమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గత రెండు రోజులుగా వైద్యుల పర్యవేక్షణలో ఉన్న ఆయనకు పలు పరీక్షలు నిర్వహిస్తున్నారని వర్గాలు వెల్లడించాయి. ఈ రోజే డిశ్చార్జ్ అవుతారా లేదా అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే నమీబియాతో మ్యాచ్‌లో ఆడటంపై సందిగ్ధత నెలకొంది.

ఆశాభావం వ్యక్తం చేస్తున్న బీసీసీఐ

ఇటీవల ఫిబ్రవరి 7న ఖూూతో జరిగిన మ్యాచ్‌లో కూడా అభిషేక్ పూర్తిస్థాయిలో పాల్గొనలేదు. రెండో ఇన్నింగ్స్‌లో మైదానంలోకి దిగకపోవడం గమనార్హం. సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో భారత అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డోస్‌చేట్ మాట్లాడుతూ జట్టుపై తుది నిర్ణయం మ్యాచ్‌కు ముందు తీసుకుంటామని తెలిపారు. ఇదిలా ఉండగా, ఫిబ్రవరి 15న కొలంబోలో పాకిస్థాన్‌తో జరిగే అత్యంత కీలక మ్యాచ్‌కు అభిషేక్ తిరిగి అందుబాటులోకి వస్తారని జట్టు యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ నివాసంలో జరిగిన విందుకు హాజరైన ఆయన ఆరోగ్యం మెరుగుపడుతుందనే సంకేతాలే ఉన్నాయని తెలుస్తోంది. అభిషేక్ ఆడలేని పరిస్థితి వస్తే, ఆయన స్థానంలో సంజు శాంసన్ జట్టులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.

శాంసన్‌కు మరో అవకాశం దక్కుతుందా

భారత టీ20 జట్టులో చోటు కోసం పోటీ రోజురోజుకు పెరుగుతోంది. శుభ్‌మాన్ గిల్‌ను టీ20ల నుంచి తప్పించిన తర్వాత 31 ఏళ్ల సంజు శాంసన్‌కు న్యూజిలాండ్ సిరీస్‌లో ప్లేయింగ్ ఎలెవన్‌లో రెగ్యులర్ అవకాశం దక్కింది. అభిషేక్ శర్మతో కలిసి అతను ఇన్నింగ్స్‌ను ప్రారంభించాడు. అయితే, ఈ సిరీస్‌లో శాంసన్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. ఐదు మ్యాచ్‌ల్లో కేవలం 46 పరుగులే చేయగలిగాడు. అతని సగటు 9.20 కాగా, స్ట్రైక్‌రేట్ 135.29 మాత్రమే. పేలవ ప్రదర్శన కారణంగా తుదిజట్టులో తన స్థానాన్ని కోల్పోయాడు. తద్వారా అభిషేక్ శర్మఇషాన్ కిషన్‌లతో కొత్త ఓపెనింగ్ జతను భారత జట్టు ప్రయోగించింది. తిలక్ వర్మను నం.3 స్థానంలోకి తీసుకువచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో శాంసన్ భవిష్యత్తుపై సందేహాలు నెలకొన్నాయి. అయితే తాజా పరిణామాలు అతనికి మరో అవకాశం కల్పించేలా కనిపిస్తున్నాయి. నమీబియాతో జరగనున్న మ్యాచ్‌కు అభిషేక్ శర్మ దూరమైతే, టాప్ ఆర్డర్‌లో ఖాళీ ఏర్పడే అవకాశం ఉంది. ఆ స్థానానికి శాంసన్ మళ్లీ ఎంపికయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. గణాంకాల పరంగా చూస్తే, శాంసన్ ఇప్పటివరకు 23 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో మూడు సెంచరీలు, ఒక అర్ధ సెంచరీతో కలిపి మొత్తం 605 పరుగులు చేశాడు. ముఖ్యంగా ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన సందర్భాల్లో అతను దూకుడైన ఆటతో మెప్పించాడు. మరి ఈ అవకాశాన్ని శాంసన్ సద్వినియోగం చేసుకుని జట్టులో తన స్థానం స్థిరపరచుకుంటాడా? లేక యువ ఆటగాళ్ల పోటీలో మళ్లీ వెనుకబడతాడా అనేది చూడాలి.

### అభిషేక్ శర్మ ఆట విషయానికి వస్తే

పొట్టి ఫార్మాట్‌లో అభిషేక్ శర్మ అద్భుత ఫామ్‌లో కొనసాగుతున్నాడు. ఇప్పటివరకు 39 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన ఆయన రెండు సెంచరీలు, ఎనిమిది హాఫ్ సెంచరీలతో కలిపి 1297 పరుగులు సాధించాడు. టీ20 ఫార్మాట్‌లో నంబర్ వన్

## వనితలు జర భద్రం.. డయాబెటిస్ పై తాజా పరిశోధనలో షాకింగ్ ఫ్యాక్ట్స్

మధుమేహం వల్ల కలిగే దుష్ప్రభావాలు స్త్రీ, పురుషుల్లో వేర్వేరుగా ఉంటాయని తాజా పరిశోధనలో వెల్లడైంది. మగవారితో పోల్చుకుంటే మహిళల్లో ఈ దుష్పరిణామాలు కాస్త ఎక్కువగా ఉంటాయని తేలింది.



మధుమేహం వల్ల కలిగే దుష్ప్రభావాలు స్త్రీ, పురుషుల్లో వేర్వేరుగా ఉంటాయని తాజా పరిశోధనలో వెల్లడైంది. మగవారితో పోల్చుకుంటే మహిళల్లో ఈ దుష్పరిణామాలు కాస్త ఎక్కువగా ఉంటాయని తేలింది. మధుమేహ దుష్ప్రభావాలపై దక్షిణ భారతదేశంలో చెన్నయ్ అర్బన్ రూరల్ ఎపిడెమియోలాజికల్ (క్యూర్స్-159) పేరిట స్టడీ నిర్వహించారు. 200103 నుంచి 201214 మధ్య మొత్తం 1,053 మంది (453 పురుషులు, 600 మహిళలు) ఆరోగ్య స్థితిగతులను పన్నెండేళ్ల పాటు అధ్యయనం చేశారు. మధుమేహం కలిగిన వారిలో కంటి సమస్యలు, నరాల బలహీనత, కిడ్నీ వ్యాధులు, గుండె జబ్బులు, కాళ్లలో రక్తప్రసరణ లోపాల వంటి సమస్యలను గుర్తించారు. డయాబెటిక్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు పురుషులతో కంటే స్త్రీలలో కాస్త ఎక్కువగా ఉన్నట్టు నిర్ధారించారు. ఆ వివరాలను ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ప్రచురించింది.

### వేర్వేరుగా దుష్ప్రభావాలు

మహిళల్లో కిడ్నీ సంబంధిత సమస్యలు 36.1 శాతం నమోదు కాగా, ఇది పురుషుల్లో 31.4 శాతమే. ఇక కాళ్లలో రక్తప్రసరణ తగ్గిపోయే పెరిఫెరల్ ఆర్టరీ డిసీజ్ కూడా మహిళల్లో 35.4 శాతం ఉండగా.. ఇది పురుషుల్లో 23.9 శాతానికే పరిమితమైంది. డయాబెటిక్ పెరిఫెరల్ న్యూరోపతి విషయంలో మాత్రం లింగభేదం కనిపించలేదు. పురుషులు (63శాతం), మహిళలు (63శాతం) సమాన స్థాయిలో ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు వెల్లడైంది. ఇది భవిష్యత్‌లో కాలి గాయాలు, కాళ్ల తొలగింపు వరకు దారితీసే ప్రమాదం ఉండటంతో వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, మధుమేహం కారణంగా వచ్చే కంటి సమస్యలు (డయాబెటిక్ రెటినోపతి) మహిళల్లో 27.3 శాతం ఉండగా.. పురుషుల్లో 37 శాతం ఉన్నది. గుండె సంబంధిత సమస్యలు (కొరోనరీ ఆర్టరీ డిసీజ్) సైతం మహిళల కంటే పురుషుల్లో (36.2 శాతం) ఎక్కువగా ఉన్నది.

వైద్య నిపుణులు సూచనలివే..

సాధారణంగా మహిళలకు ఉండే హార్మోన్ల రక్షణ వల్ల గుండె జబ్బుల ముప్పు పురుషుల కంటే తక్కువగా ఉంటుంది. కిడ్నీ సంబంధిత వ్యాధుల విషయంలో మాత్రం ముప్పు స్వల్పంగా (36.1 శాతం) ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులు కేవలం రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించుకోవడమే కాకుండా.. వారి లింగ భేదాన్ని బట్టి వచ్చే ప్రత్యేక ఆరోగ్య సమస్యల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ విశ్వనాథన్ మోహన్ బృందం సూచించింది. రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవడం ద్వారా ఈ దీర్ఘకాలిక సమస్యలను నివారించవచ్చని పేర్కొంది. మధుమేహ చికిత్స అందరికీ ఒకేలా కాకుండా.. జెండర్ వారీగా ప్రమాదాలను గుర్తించి స్క్రీనింగ్, ప్రత్యేక చికిత్సలు అందించాలని పరిశోధకులు సూచించారు. కిడ్నీ, కాళ్ల నరాల సమస్యలపై మహిళలు మరింత అప్రమత్తంగా ఉండాలని, కంటి, గుండె ఆరోగ్యంపై పురుషులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యనిపుణులు చెబుతున్నారు.

printed , published and owned by DR.B.ANILKUMAR ,@ 407 THARNAKA , HYDERABAD , Telangana state.published at DAIWIK PUBLICATIONS pvt.ltd.printed at SNEHITHA PRINTERS H.NO : 2-6 , Warangal Dist.Telangana state ,EDITOR DR.B.ANILKUMAR ,RNI NO TELTEL/2021/ 81079 , cell : 7702866885 ,vijethatelugudaily@gmail.com